News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :272 | ఖమ్మం | బుధవారం నవంబర్ 12, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## టారీఫ్ నుంచి రిలీఫ్!

### భారత్ పై సుంకాలను తగ్గిస్తున్నట్టు అమెరికా ప్రకటన




అమెరికా: సుంకాల పేరిట భారత్ పై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా తాజాగా శుభవార్త అందించింది. భారత్ పై సుంకాలను సగానికి అనగా 50 శాతం తగ్గిస్తున్ననట్టు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోళ్లే ఈ సుంకాలు రెట్టింపు కావడానికి ప్రధాన కారణమని ట్రంప్ స్పష్టం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా భారత్ పై అధిక సుంకాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు భారత్ ఆ కొనుగోళ్లను తగ్గించింది. ఫలితంగా మేము ఆ సుంకాలను సగానికి తగ్గిస్తున్నాం అని ట్రంప్ అన్నారు. అంతకు ముందు భారత్ తో

వివరాలు 2లో..

## మొంథాతో 1,17,757 ఎకరాల్లో పంట నష్టం

- ఎకరానికి రూ.10 వేల చొప్పున త్వరలో సాయం
- కేంద్రం నుంచి పరిహారం కోరతాం
- సమీక్షలో మంత్రి తుమ్మల



తెలంగాణలో మొంథా తుపానుతో రాష్ట్రంలో 1,17,757 ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.10,000 చొప్పున పరిహారం చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టాలపై వ్యవసాయ

వివరాలు 2లో..



## అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు



ప్రభుత్వ లాంఛనాలతో కవి అందెశ్రీ అంత్యక్రియలు..
అందెశ్రీ పాడెను మోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- దారి పొడుగునా అందెశ్రీ అమర్ రహే నినాదాలు
- హాజరైన మంత్రులు పొన్నం, సీతక్క, అడ్లూరి తదితరులు
- ఘట్‌కేసర్‌లో ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు
- అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు
- అందెశ్రీ లేకపోవడం తీరని లోటు అన్న ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పాడెను మోశారు. అందెశ్రీ అంత్యక్రియలు హైదరాబాద్ నగర శివారులోని ఘట్‌కేసర్‌లో నిర్వహించారు. ఈ అంతిమ సంస్కారాలకు రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంతిమ యాత్రలో అందెశ్రీ పాడెను రేవంత్ రెడ్డి మోశారు.



## ఉగ్ర కుట్రే



- దిల్లీ పేలుడు వెనుక స్లీపర్‌సెల్స్ హస్తం
- కారులో పేలినవి డిటొనేటర్లు.. నడిపింది పుల్వామా వైద్యుడు
- దొరికిపోక తప్పదని పేల్చేసుకున్నట్లు అనుమానం
- హడావుడిగా బాంబును తరలిస్తుండగా జరిగినట్లు సంకేతాలు
- ఫరీదాబాద్ పేలుడు పదార్థాలతో సంబంధం
- 12కి పెరిగిన మృతుల సంఖ్య
- విచారణ బాధ్యతలు ఎన్ఐఏకు..
- వివరాలు తెలుసుకున్న రాష్ట్రపతి ముర్ము



దిల్లీ: దేశ రాజధానిలో బాంబుపేలుడు వెనుక ఉగ్రమూలాలు ఉన్నట్లు బయటపడిం ది. హరియాణాలోని ఫరీదాబాద్‌లో భారీఎత్తున దొరికిన పేలుడు పదార్థాలకు, దీనికి సంబంధం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు బాధ్యతల్ని దిల్లీ పోలీసుల నుంచి 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) తీసుకుంది. 13 ఏళ్ల విరామం తర్వాత సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రోస్టేషన్‌కు సమీపంలో చోటుచేసుకున్న కారు పేలుడులో తొలుత తొమ్మిదిమంది మృతిచెందిన విషయం

వివరాలు 2లో..

## ఉన్నతాధికారి పాత్ర ఉంటే దర్యాప్తు ముందుకెళ్లదా?

- పోలీసుల జాప్యంపై హైకోర్టు ధ్వజం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిటిషన్‌పై విచారణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో భారాస మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి, గండ్ర గౌతంరెడ్డిలపై నమోదైన కేసు దర్యాప్తులో జాప్యంపై పోలీసులను

వివరాలు 2లో..

## బిహార్‌లో మళ్లీ ఎన్డీయేదే అధికారం


- ఆర్జేడీ నేతృత్వంలోని మహాగర్‌బంధన్‌కు 108లోపే సీట్లు
- అన్ని సర్వేల ఎగ్జిట్ పోల్స్ మాట ఇదే
- రెండో విడతలో 68.79% పోలింగ్
- 14న ఓట్ల లెక్కింపు



పట్నా/దిల్లీ: బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు మంగళవారం ముగిసిం ది. అధికార ఎన్డీయే,

వివరాలు 2లో..

## భారత్ పై పాకిస్తాన్ ప్రధాని తీవ్ర ఆరోపణలు



పాకిస్తాన్: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జిల్లా సెషన్స్ కోర్టు భవనం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించారు, మరో 36 మంది గాయపడ్డారు. ఈ ఆత్మాహుతి దాడి జరిగిన సమయంలో

వివరాలు 2లో..


## జూబ్లీహిల్స్‌లో పోలింగ్ 48.47 శాతం

- 14న ఓట్ల లెక్కింపు
- ఉద్రిక్తతల మధ్య ముగిసిన ఎన్నిక
- ఓటర్లకు పోటాపోటీగా నగదు, చీరల పంపిణీ
- నిబంధనలు ఉల్లంఘించారన్న ఫిర్యాదులపై కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నేతలపై కేసులు
- కాంగ్రెస్ రిగ్గింగ్‌ను పోలీసులు అడ్డుకోవడం లేదంటూ మాగంటి సునీత ధర్నా



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక స్వల్ప ఉద్రిక్తతల మధ్య ముగిసింది. 407 కేంద్రాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరిగింది. ఊహించినట్లే... ఎక్కువ మంది ఓటర్లు పోలింగ్‌పై అనాసక్తి ప్రదర్శించారు.

వివరాలు 2లో..



## బెట్టింగ్ యాప్‌ల కేసు.. సిట్ విచారణకు సినీనటుడు విజయ్ దేవరకొండ

నటి సిరి హనుమంతు సైతం..

నేడు హాజరుకానున్న నటుడు ప్రకాశ్‌రాజ్

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో సినీనటుడు విజయ్ దేవరకొండ మంగళవారం సాయంత్రం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణకు హాజరయ్యారు. సీఐడీ కార్యాలయంలో అధికారులు ఆయన్ని సుమారు గంటపాటు విచారించారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ఎలా ప్రచారం కల్పించారు..? అందుకు చేసుకున్న ఒప్పందమేంటి..? ఎంత పారితోషికం తీసుకున్నారు..? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే తాను చట్టబద్ధంగానే ఎ23 గేమింగ్ యాప్‌నకు మాత్రమే ప్రచారం చేశానని, అది కబడ్డీ, ఐపీఎల్, వాలీబాల్ లాంటి క్రీడలకు స్పాన్సర్ చేస్తుందని విజయ్ చెప్పినట్లు సమాచారం.

వివరాలు 2లో..

## ఒక్కొక్కడిని వేటాడండి..

- ఏపీ కేడర్ సీనియర్ ఐపీఎస్ అధికారికి పూర్తి స్వేచ్ఛ
- ఎర్రకోట కారు బాంబు పేలుడు ఘటన... అధికారులకు అమిత్ షా ఆదేశాలు
- ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై దర్యాప్తు సంస్థలు ఉక్కుపాదం మోపుతాయన్న అమిత్ షా
- పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో రెండు సమీక్ష సమావేశాలు నిర్వహించిన అమిత్ షా
- ప్రతి నిందితుడిని వేటాడాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడి



న్యూ దిల్లీ, నవంబర్ : దిల్లీ లోని చారిత్రాత్మక రెడ్ ఫోర్ట్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన పేలుడు ఘటన, యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ పేలుడులో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారికి దిల్లీ లోక్ నాయక్

వివరాలు 2లో..

# ఉగ్ర కుట్రే

-మొదటిపేజీ తరువాయి

తెలిసిందే. విషమ పరిస్థితుల్లో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారిలో మరో ముగ్గురు మంగళవారం చనిపోవడంతో మృతుల సంఖ్య 12కి చేరింది. మృతుల్లో ఇప్పటివరకు ఇద్దరిని గుర్తించారు. వారిలో ఒకరు ఉత్తర్‌ప్రదేశ్, మరొకరు ఢిల్లీకి చెందినవారు. మిగిలినవారి వయసు 28-58 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. గాయపడిన 20 మందిలో 12 మంది ఢిల్లీవాసులు. కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందినవాడిగా తేలింది. ఫరీదాబాద్ పేలుడు పదార్థాలతో సంబంధం ఉండటంతో ఇక దొరికిపోక తప్పదనే భయంతోనే ఆ వైద్యుడు ఆత్మాహుతికి పాల్పడ్డాడా, లేదా అనుకోకుండా పేలాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు ప్రణాళికతో చేసింది కాదని పోలీసులు చెబుతున్నారు. పూర్తిస్థాయి బాంబును వాడితే విధ్వంసం ఇంకా తీవ్రంగా ఉండేదని, బాంబును హడావుడిగా సిద్ధం చేసి తరలిస్తుండగా అది పేలినట్లు ఉందని విశ్లేషిస్తున్నారు. కారులో ఉన్నది అమ్మోనియం నైట్రేట్, మరో రకం ఇంధనం, డిటొనేటర్లు అయి ఉండవచ్చని, ఆత్మాహుతి దాడిని తోసిపుచ్చలేమని అధికారులు చెబుతున్నారు.

పేలుడుకు కారకులైనవారిలో ఎవరినీ వదిలిపెట్టేది లేదని, భద్రతాబలగాల ప్రతాపమేంటో వారికి చూపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఢిల్లీతోపాటు దేశవ్యాప్త పరిస్థితులపై ఆయన ఉన్నతస్థాయిలో రెండుసార్లు సమీక్ష నిర్వహించారు. అంగోలా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడుపై దర్యాప్తు వివరాలను త్వరలోనే బహిర్గతం చేస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దోషులను ఎట్టిపరిస్థితుల్లోనూ చట్టం ముందు నిలబెడతామని చెప్పారు.

**ఆ 3 గంటల్లో ఏం జరిగింది?**

సోమవారం మధ్యాహ్నం 3:19 గంటలకు ఎర్రకోట పార్కింగ్ ప్రదేశానికి వచ్చిన కారు సాయంత్రం 6:22 గంటల వరకు అక్కడే ఉంది. ఆ కారులో ముగ్గురు ఉన్నట్లు సోమవారం భావించగా అందులో డాక్టర్ ఉమర్ ఒక్కడే ఉన్నాడని, ఒక్కసారి కూడా దాని నుంచి కిందికి దిగలేదని పోలీసులు తాజాగా చెబుతున్నారు. ఆ మూడు గంటలు ఏం చేశాడు? ఎవరితో మాట్లాడాడనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఎక్కువ రద్దీ ఉండే సమయం కోసం వేచి ఉన్నాడా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఉగ్రమూకల తుది ఆదేశాల కోసం, లేదా ఏదైనా సాయం కోసం అతడు అక్కడ ఎదురుచూసి ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉమర్ నబీ ఒకప్పుడు ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశాడు. అక్కడే మరో ఉగ్ర అనుమానితుడు ముజమ్మిల్ షకీల్‌కు సన్నిహితుడయ్యాడని తెలుస్తోంది. ఇద్దరూ కలిసి పేలుడు పదార్థాలతో ఢిల్లీకి వచ్చారా? లేక వేర్వేరుగానా అనేది ఆరా తీస్తున్నారు. ఉగ్ర ముఠాలకు వైద్యుల మద్దతుపై విచారణ కొనసాగుతోంది. అధికారుల అనుమానం ప్రకారం.. ఉమర్ గత కొంతకాలంగా ఉగ్రవాద సిద్ధాంతానికి ప్రేరేపితుడయ్యాడు.

**ఢిల్లీలో హై అలర్ట్**

ఉగ్రదాడి నేపథ్యంలో ఢిల్లీలో హై అలెర్ట్ ప్రకటించి అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో భద్రత కట్టుదిట్టం చేశారు. హోటళ్లు, అతిథిగృహాల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు నిర్వహించారు. రిజిస్టర్లను పరిశీలించారు. పేలుడుకు సంబంధించి కోట్వాలీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రకటించారు. శాశ్వత వైకల్యానికి గురైనవారికి రూ.5 లక్షలు, తీవ్ర గాయాలైనవారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైనవారికి రూ.20,000 ఇస్తామని తెలిపారు.

# అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ అంత్యక్రియల అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు.

వ్యక్తిగతంగా, తెలంగాణ సమాజానికి లోటు: రేవంత్ రెడ్డిఅందెశ్రీ మరణం వ్యక్తిగతంగా తనకు, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో రాష్ట్రం గురించి అనేక విషయాలు ఆయనతో చర్చించినట్లు తెలిపారు. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్రగీతంగా నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అందెశ్రీ ప్రతి మాట ప్రజా జీవితం నుంచి పుట్టుకు వచ్చిందని అన్నారు. ప్రతి పాట తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని అన్నారు. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేరుస్తామని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన మహనీయుడు ఆయన అని అన్నారు. ఆయన రచనలకు సంబంధించిన 'నిప్పులవాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు.

# ఉన్నతాధికారి పాత్ర ఉంటే దర్యాప్తు ముందుకెళ్లదా?

- మొదటి పేజీ తరువాయి

హైకోర్టు నిలదీసింది. జనవరిలో ఎఫ్ఐఆర్ దాఖలైతే ఇప్పటివరకు ఛార్జిషీటు ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. కేసులో ఉన్నతాధికారి పాత్ర ఉంటే దర్యాప్తు ముందుకెళ్లదా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు అధికారులను బెదిరించి కొంపల్లిలోని సర్వే నెం.209లో 2 ఎకరాల చెరువు శిఖం భూమిలో ఆలయం, వాణిజ్య సముదాయం నిర్మాణం చేపట్టడంపై ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. దీన్ని కొట్టివేయాలంటూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ ఆలయానికి జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధుల నుంచి రూ.2.5 కోట్లను ఎమ్మెల్యే చెబితే కలెక్టర్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదుదారు మృతి చెందారని, దర్యాప్తు పూర్తి కాలేదన్నారు. ఏపీపీ వాదనలు వినిపిస్తూ దర్యాప్తు కొనసాగుతోందని, అధికారుల నుంచి పత్రాలు అందకపోవడంతో జాప్యం జరుగుతోందన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ఇందులో కలెక్టర్ పాత్ర ఉన్నందున పత్రాలు ఎప్పటికీ అందవన్నారు. అధికారులు పత్రాలు ఇవ్వకపోతే కోర్టు నుంచి ఉత్తర్వులు ఎందుకు పొందకూడదని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరణకు నిరాకరిస్తూ తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు.

# మొంథాతో 1,17,757 ఎకరాల్లో పంట నష్టం

- మొదటి పేజీ తరువాయి

శాఖ ఇచ్చిన నివేదికను కేంద్రానికి పంపి పరిహారం కోరతామన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయశాఖ నివేదికపై సమీక్ష నిర్వహించారు. "తుపాను ప్రభావిత జిల్లాలలో వ్యవసాయశాఖ అధికారుల బృందం సర్వే చేసి 33%కి పైగా పంట నష్టం జరిగిన రైతుల వివరాలు సేకరించి నివేదిక ఇచ్చింది. 27 జిల్లాలలోని 1,22,142 మంది రైతులకు చెందిన 1,17,757 ఎకరాల్లో పంట నష్టాలను గుర్తించింది. ఇందులో ప్రధానంగా 83,407 ఎకరాల్లో వరి, 30,144 ఎకరాల్లో పత్తి, 2,097 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులు నష్టపోయారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరంలో ఇసుక మేటకు రూ.7,285బీ ప్రాజెక్టులు, చెరువుల కింద ఎకరానికి రూ.6,880బీ వర్షాధార పంటలకు రూ.3,440బీ తోటలకు రూ.9,106 చొప్పున మొత్తం రూ.70 కోట్ల పరిహారం ఇవ్వాలి. గతంలో కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఈసారి నష్ట నివేదికను ఢిల్లీకి పంపి పరిహారం ఇవ్వాలని అడుగుతాం. ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర బృందాన్ని పంపించాలని కోరాం" అని మంత్రి తెలిపారు.

ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్

ఏడాదికి 2 లక్షల ఎకరాల చొప్పున వచ్చే నాలుగేళ్లలో 8 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. మంగళవారం ఆయిల్‌పామ్‌పై సమీక్ష జరిపారు. "రాష్ట్రంలో ప్రస్తుతం 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగయింది. మార్చి నాటికి తక్కిన లక్ష్యం చేరుకోవాలి. వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, జోగులాంబ గద్వాల, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు లక్ష్యాలను సాధించలేదు. వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వచ్చే సంవత్సరానికల్లా ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక ఆయిల్ పామ్ శుద్ధి పరిశ్రమను స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి" అని మంత్రి సూచించారు.

# జూబ్లీహిల్స్‌లో పోలింగ్ 48.47 శాతం

- మొదటి పేజీ తరువాయి

పోలింగ్ గడువు ముగిసే సమయానికి 48.47 శాతం నమోదైందని.. కొన్ని కేంద్రాల్లో ఇంకా ఓటర్లున్నందున పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. తొలిసారిగా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అధికారులు డ్రోన్లను వినియోగించారు. ప్రతి బూత్‌లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. సినీ ప్రముఖులు ఎస్.ఎస్.రాజమౌళి దంపతులు, గోపీచంద్, తనికెళ్ల భరణి తదితరులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.పోలింగ్ రోజు నియోజకవర్గం పరిధిలో స్థానికేతరులు ఉన్నారన్న ఫిర్యాదులపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రామచందర్‌నాయక్, రాందాస్‌లపై మధురానగర్ పోలీస్ ఠాణాలో, భారత రాష్ట్ర సమితికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, మెతుకు ఆనంద్, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఆ పార్టీ నేత మెట్టు దయానంద్‌లపై బోరబండ ఠాణాలో కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. షేక్‌పేట, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని పలు బూత్‌ల వద్ద కాంగ్రెస్ నాయకులు, భారత రాష్ట్ర సమితి కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. బోరబండ డివిజన్‌లోని స్వరాజ్యనగర్‌లో మూడు పోలింగ్ బూత్‌ల వద్ద కాంగ్రెస్ నాయకులు ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. పోలీస్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టోలీచౌకిలో ఓ బూత్ వద్దకు ఓటేసేందుకు వస్తున్నవారిని భారత రాష్ట్ర సమితి నాయకులు అడ్డుకున్నారంటూ మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోల్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నవారి వద్ద ఉన్న టేబుళ్లను విసిరేశారు.

షేక్‌పేట్ డివిజన్‌లోని సమతా కాలనీలో అపెక్స్ పాఠశాల వద్దకు సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో రావడంతో.. విషయం తెలిసి భారత రాష్ట్ర సమితి నాయకులు అక్కడికి చేరుకున్నారు. వారిని పోలీసులు లాఠీలతో చెదరగొట్టారు. కాంగ్రెస్ నాయకులు రిగ్గింగ్ చేస్తున్నా పోలీసులు అడ్డుకోవడం లేదంటూ మాగంటి సునీత కృష్ణానగర్‌లో బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులపై ఫిర్యాదు చేసేందుకు ఆమె సాయంత్రం 5 గంటల సమయంలో యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్దకు రాగా... కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రావడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆమె రహదారిపై ధర్నాకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వచ్చి సునీతకు మద్దతుగా పాల్గొన్నారు. వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.

**ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు...**

ప్రధాన పార్టీల నేతలు పోలింగ్ రోజు కూడా పోటాపోటీగా పంపకాలు సాగించారు. వాస్తవానికి సోమవారం రాత్రే పంపకాలు పూర్తి కాగా... బోరబండ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ డివిజన్లలో ఓటు వేసేందుకు ముందుకురాని ఓటర్లకు మంగళవారం నగదు పంచారు. రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లలో ప్రధాన పార్టీల నేతలు రూ.2,500 నగదుతో పాటు పట్టుచీరలు ఇచ్చారు. బోరబండ డివిజన్‌లోని పలు పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓ ప్రధాన పార్టీ ఎమ్మెల్యేలు కొన్ని ఇళ్లలో ఉండి... ఓటర్లను అక్కడికి రప్పించుకుని నగదు అందజేశారు. మరో ప్రధాన పార్టీ వారు బస్తీల్లోని ఇళ్లకు వెళ్లి ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు.మధ్యాహ్నం 12 గంటలైనా ఓటు వేసేందుకు ఓటర్లు రాకపోవడంతో ఓ పార్టీ నాయకులు బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని కొన్ని బస్తీలకు వెళ్లి ఒక్కో ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల చొప్పున ఇవ్వడం గమనార్హం. కొన్నిచోట్ల పోల్ స్లిప్పులు పంపిణీ చేసేవారు తమ వద్ద ఉన్న టేబుళ్ల కింద చీరలు ఉంచుకుని... మహిళలు ఓటు వేసి రాగానే అందించారు. ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నా పోలీసులు అడ్డుకోవడం లేదంటూ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.

## టారీఫ్ నుంచి రిలీఫ్!

-మొదటిపేజీ తరువాయి

వాణిజ్య సంబంధాలలో తగ్గుదల గురించి ట్రంప్ సూచనప్రాయంగా మాట్లాడుతూ తాము ఇండియాతో వాణిజ్య ఒప్పందానికి అతి దగ్గరగా ఉన్నామని, భారతీయ వస్తువుల పై విధించిన అధిక సుంకాలను త్వరలో తగ్గించే అవకాశమున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్ ప్రధాని మోదీ ని కూడా ప్రశంసించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందన్న కారణంతో తొలుత 25 శాతం సుంకాన్ని విధించారు ట్రంప్. ఆ తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలను కొనుగోలు చేయడం ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్, రష్యాకు ఆర్థికంగా మద్దతిస్తోందని ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే.

## బెట్టింగ్ యాప్‌ల కేసు.. సిట్ విచారణకు సినీనటుడు విజయ్ దేవరకొండ

-మొదటిపేజీ తరువాయి

దానికి తెలంగాణలో యాక్సెస్ లేకపోవడంతోనే తాను ఒప్పందంపై సంతకం చేశానని చెప్పినట్లు తెలిసింది. ఒప్పందాల పత్రాలను సిట్‌కు అప్పగించారు. ఇదే కేసులో గత మార్చిలో ఈడీ విచారణ సందర్భంగా చెప్పిన అంశాలనే విజయ్ సిట్ ఎదుట చెప్పినట్లు సమాచారం. వాటిల్లో వాస్తవమేంటనే కోణంలో సిట్ ఆరా తీయనున్నట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం విజయ్ వెనుక గేటు నుంచి వెళ్లిపోయారు.అంతకు ముందు ఉదయం ఇదే కేసులో నటి సిరి హనుమంతు కూడా సిట్ విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు సినీతారలు, సెలబ్రిటీలు ప్రచారం కల్పించడంతో పలువురు యువకులు వాటికి బానిసలై ప్రాణాలు పోగొట్టుకున్నారంటూ పలు ఠాణాల్లో కేసులు నమోదవడంతో వాటి విచారణకు సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆయా కేసుల్లో విజయ్‌తోపాటు సినీనటులు రాణా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి సహా మొత్తం 29 మంది నిందితులుగా ఉన్నారు. దర్యాప్తులో భాగంగా సిట్ ఇటీవలే విజయ్‌తోపాటు ప్రకాశ్‌రాజ్, సిరి హనుమంతులకు సమన్లు జారీ చేసింది. ప్రకాశ్‌రాజ్ బుధవారం విచారణకు హాజరవుతారని సిట్ వర్గాలు వెల్లడించాయి. మిగిలిన వారినీ త్వరలోనే విచారించనున్నట్లు తెలిపాయి.

## ఒక్కొక్కడిని వేటాడండి..

-మొదటిపేజీ తరువాయి

జయప్రకాష్ నారాయణ్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తోన్నారు. వారిలో ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉంటోంది. రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. గుజరాత్ లో ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన అతి కొద్దిరోజుల్లోనే ఈ పేలుడు సంభవించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీని తర్వాత ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. అన్ని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనసమ్మర్ధంతో కూడుకుని ఉన్న ప్రదేశాలు, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల పై నిఘా పెంచారు. రాత్రంతా పోలీసులు పహారా చేపట్టారు. వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగింది. అనుమానాస్పద వ్యక్తులను అదుపు లోకి తీసుకుని విచారించిన అనంతరం వదిలిపెట్టారు. దీని పై జాతీయ దర్యాప్తు సంస్థను రంగం లోకి దింగింది. సమగ్ర దర్యాప్తు చేపట్టింది. ఢిల్లీ వ్యాప్తంగా ఉగ్రకదలిక లపై నిఘా పెట్టింది. యూఏపీఏ కింద కేసులు నమోదయ్యాయి. యూఏపీఏ లోని సెక్షన్లు 16, 18, ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ లోని సెక్షన్లు 3, 4, భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 103(1), 109(1), 61(2) కింద ఈ కేసు పెట్టారు. రెడ్ ఫోర్ట్ ను మూసివేశారు. ఈ ప్రాంతం మొత్తాన్ని కూడా తమ ఆధీనం లోకి తీసుకున్నారు. అలాగే- రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ కూడా క్లోజ్ అయింది. ఈ ఘటన పై కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఢిల్లీ కర్తవ్య భవన్‌లో ఈ భేటీ ఏర్పాటైంది. హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఏర్పాటైన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్ హాజరయ్యారు. కొద్దిసేపటి కిందటే ఈ భేటీ ముగిసింది. దీనికి సంబంధించిన వివరాలను అమిత్ షా వెల్లడించారు. ఈ ఘటన వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ వేటాడి పట్టు కోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ చర్యలో పాలుపంచుకున్న వారందరూ చట్టం ముందు తప్పకుండా నిలబడతారని, కఠిన శిక్షను ఎదుర్కొంటారని చెప్పారు. ఈ వివరాలను క్లుప్తంగా తన అధికారిక ఎక్స్ అకౌంట్ లో పోస్ట్ చేశారు.

## భారత్ పై పాకిస్తాన్ ప్రధాని తీవ్ర ఆరోపణలు

-మొదటిపేజీ తరువాయి

ఇస్లామాబాద్‌లో పలు అంతర్జాతీయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇంటర్-పార్లమెంటరీ స్పీకర్స్ కాన్ఫరెన్స్, మర్గల్లా డైలాగ్ వంటివి ఇందులో ఉన్నాయి. రావల్పిండిలో శ్రీలంక- పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ కూడా జరుగుతున్న సమయంలో ఈ ఘటన సంభవించింది. ఈ ఘటన పై పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఈ ఘటనకు భారత్ కారణమని ఆరోపించారు. సోమవారం వానాలోని క్యాడెట్ కళాశాల పై జరిగిన దాడిలో కూడా భారత్ పాత్ర ఉందని విమర్శించారు. ఆఫ్ఘనిస్తాన్ లో అధికారంలో ఉన్న తాలిబన్ ప్రభుత్వం భారత్ కు ప్రాక్సీగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇస్లామాబాద్, వానాల్లో చోటు చేసుకున్న ఈ రెండు దాడులకు కూడా భారత్- దాని అనుబంధ ఉగ్రవాద ప్రాక్సీలు కారణమని షరీఫ్ అన్నారు. ఈ దాడులతో పాకిస్తాన్ ను భయపెట్టలేరని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. తమ దేశాన్ని ఎవరూ అస్థిరపరచలేరని చెప్పారు. ఇక్కడి ప్రభుత్వాన్ని భయాందోళనలకు గురి చేయడం, అస్థిర పరచడానికి భారత్ సాగిస్తోన్న ప్రయత్నాలేవీ ఫలించబోవని అన్నారు. భారత్- ఆ దేశం స్పాన్సర్ చేస్తోన్న ఉగ్రవాదానికి ఇస్లామాబాద్, వానా దాడులు కొనసాగింపుగా భావిస్తోన్నామని షెహబాజ్ షరీఫ్ చెప్పారు. ఈ దాడులను ఎంత ఖండించినా తక్కువేనని చెప్పారు. భారత్ మద్దతు ఇస్తోన్న మిలిటెంట్లు ఇస్లామాబాద్ పై దాడి చేశారని, ఆఫ్ఘన్ భూభాగం నుండి పనిచేస్తున్న అదే నెట్‌వర్క్ వానాలో అమాయక పిల్లల ప్రాణాలు తీశారని అన్నారు. తమ దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి భారత్. ఆఫ్ఘనిస్తాన్ తో కలిసి పని చేస్తోందని షరీఫ్ ఆరోపించారు. వారి ఉద్దేశాలు ఇక్కడ కార్యరూపం దాల్చబోవని, వీటిని అడ్డుకుంటామని అన్నారు. కాగా- ఈ ఆత్మాహుతి దాడికి పాకిస్తానీ తాలిబన్ (టీటీపీ) బాధ్యత వహించింది. రాజధానిలో ఇలాంటి దాడి జరగడం చాలా సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి. పాకిస్తాన్ కు చెందిన నాన్ ఇస్లామిక్ చట్టాల ప్రకారం తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులను ఉద్దేశించి ఈ దాడులు చేశామని టీటీపీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ముస్లిం మెజారిటీ దేశంలో ఇస్లామిక్ చట్టాలు అమలు అయ్యే వరకు దాడులు జరుగుతాయని కూడా హెచ్చరించింది.

## బిహార్‌లో మళ్లీ ఎన్డీయేదే అధికారం

-మొదటిపేజీ తరువాయి

విపక్ష మహాగఠ్‌బంధన్ మధ్య తీవ్ర పోటీ కొనసాగింది. ఓటర్లు భారీగా తరలిరావడంతో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ నెల 14న ఫలితాలు వెల్లడి కానుండగా విజయం ఎవరిని వరిస్తుందనే విషయమై ఉత్కంఠ నెలకొంది. అయితే, మంగళవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా మళ్లీ ఎన్డీయేనే అధికారాన్ని చేజిక్కించుకోబోతోందన్న అంచనాల ను వెల్లడించాయి. విపక్ష మహాగఠ్ బంధన్ మాత్రం ఎగ్జిట్ పోల్స్‌ను తోసిపుచ్చింది. గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేసింది.వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ మొత్తం మీద ఎన్డీయేనే మళ్లీ అధికారంలోకి రాబోతోందని ముక్తకంఠంతో తేల్చాయి. ఈ కూటమికి గరిష్ఠంగా 167 స్థానాలు లభిస్తాయని మ్యాట్రిజ్ సర్వే పేర్కొనగా...130 స్థానాల కన్నా తక్కువ రావని అన్ని సర్వే సంస్థలు తెలిపాయి. విపక్ష మహాగఠ్ బంధన్ గరిష్ఠంగా 108 స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని చాణక్య స్ట్రాటెజీస్ అంచనా వేసింది. అయితే, ఈ కూటమి 70కి పైగా స్థానాలను దక్కించుకుంటుందని అన్ని సర్వే సంస్థలూ చెబుతున్నాయి. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీకి 5 స్థానాలకు మించి గెలిచే అవకాశాలు లేనట్లు విశ్లేషించాయి.'గతంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పిన సందర్భాలున్నాయి. ఈ సారి కూడా అదే జరగబోతోంది. తేజస్వీ యాదవ్ సర్కారు ఏర్పడడం ఖాయం' అని ఆర్‌జేడీ నేత మృత్యుంజయ్ తివారీ పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఎన్డీయే నేత, బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు చలికోట్లు పంపిణీ చేసిన తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, (సాయి కౌశిక్)నవంబర్ 11,**భద్రాచలం ఎస్ సి బాలుర ఆనంద నిలయం హాస్టల్ విద్యార్థులకు భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు చలి కోట్లు, మంకీ కాప్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. హాస్టల్లో సౌకర్యాలు ఒకప్పటి కంటే ఇప్పుడు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. హాస్టల్లో భోజన సదుపాయాలతో పాటు వారికి ఇచ్చే వస్తువులు కూడా నాణ్యతతో ఉన్నాయని అన్నారు. చలికాలం ప్రారంభానికి ముందే చలి కోట్లు మంకీ క్యాప్ లు అందించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్. ప్రసాద్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖేడ్ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం :



**నవంబర్ 11 (సి కె న్యూస్) అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు దీనికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షులు మైనోద్దీన్ ఖురేషీ, ప్రధాన కార్యదర్శి తాహేర్ అలీ మరియు సభ్యులు హాజరయ్యారు. తాహేర్ అలీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలం ఆజాద్ గొప్ప విద్యా వేత్త అనీ, ఆయన జన్మదిన సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ%శీ%గా మరియు మైనారిటీ వెల్ఫేర్ డే గా జరుపుకుంటారనీ ఆయన సేవలను స్మరించుకుంటూ పిల్లలు కూడా మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి ఎదగాలాని కోరారు. పాఠశాల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగా పి రమేష్ (ఆర్ట్ /క్రాఫ్ట్) , జహంగీర్ (సెక్యూరిటీ గార్డు) లను ముస్లిం యాక్షన్ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. మరియు సోసైటీ జిల్లా స్థాయి స్పార్క్ ఫెస్ట్ లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు పాఠశాల /కళాశాల కో ఆర్డినేటర్ జాకీర్, సంజీవ్ నాయక్, ఉపాధ్యాయులు వారికి ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షులు మైనోద్దీన్ ఖురేశి,యునుస్, అజీమ్ ఇతర కాంగ్రెస్ నాయకులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, శక్తి సీడ్స్




**నవంబర్ 11 (సీ కే న్యూస్) చేగుంట /** మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్న శంకరంపేట మండలంలో గల, శక్తి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, యాజమాన్యం వారు 2024 యాసంగిలో వరి ఆడ మగ విత్తన ఉత్పత్తి పంట కొరకై ఎస్సార్ 30 అనే రకం రైతులకు చందంపేట శంకరంపేట శాలిపేట గజగట్లపల్లి పోలంపల్లి సంకాపూర్ ఇబ్రహీంపూర్ గల గ్రామాలలో వితనోత్పత్తిని అనగా ఆడ మగ వరి పండించడానికి వాళ్లు వాళ్లు రైతులకు మోటివేషన్ చేసి పంట వేయించినారు వీరు కంపెనీ వారు ఈ యొక్క పంటను ఆడ విత్తనాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని మాట ఇచ్చినారు ఒక క్వింటాకు 12 వేల రూపాయలు ఇస్తామని మాట ఇచ్చినారు ఒకవేళ దిగుబడి రానీయడల అన్ని రకాలుగా పని చేసిన తర్వాత కంపెనీ యాజమాన్యం చెప్పిన విధంగా చేసిన తర్వాత దిగుబడి రాని యెడల ఒక ఎకరానికి నష్టపరిహారం కింద 75000 నష్టపరిహారం చెల్లిస్తామని ఒప్పుకొని మాట ఇచ్చినారు ఈ యొక్క ధాన్యం తీసుకొని వెళ్ళిన రోజు నుంచి 45 రోజులలోపు డబ్బులు చెల్లిస్తామని ఒప్పుకున్నారు ఇప్పుడు మేము డబ్బులు అడగగా మీరు పండించిన పంట మాకు సరిగ్గా రాలేదు అని మమ్మల్ని మోసం చేయడం జరుగుతుంది ఇందులో ఉన్న మధ్యలో ఉన్న ఆర్గనైజర్లు ను డబ్బులు నుఅడగగా కంపెనీ ఇచ్చిన కాడికి ఇస్తాను నేనేం చేయలేను అని చెప్పాడు ఆయనను తీసుకొని రైతులము అందరము నాలుగు సార్లు కంపెనీ వద్దకు వెళ్లిన వాళు ృ ఇవ్వాల రేపు ఇస్తామని మాట ఇచ్చి 5 నెలలు గడుస్తున్న సగం డబ్బులు మాత్రమే చెల్లించారు మిగతా డబ్బులు అడగ మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి డబ్బులు మేము ఇచ్చే కాడికి ఇచ్చాము మీకు దిక్కున చోట చెప్పుకోండి అని మమ్మల్ని బెదిరించి పోలీసులతో బెదిరించారు ఇట్టి పంటను పండించి మాకు ఏడాది గడుస్తున్న ఇప్పటివరకు కంపెనీ స్పందించడం లేదు దీన్ని ఈ యొక్క విషయాన్ని వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు,

# విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, (సాయి కౌశిక్)నవంబర్ 11,**భారత రత్న, భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ జీవితంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి, మైనార్టీల సంక్షేమ దినోత్సవం మరియు జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలిసి హాజరైమౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు అపారమని అన్నారు. ఆయన భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యా విధానానికి పునాది వేయడంతో పాటు పేద, వెనుకబడిన వర్గాల పిల్లల విద్యకు మార్గం చూపారని వివరించారు. మౌలానా ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, రచయిత, విద్యావేత్తగా దేశానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గం నేటికీ విద్యావేత్తలకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
దేశం మరియు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ జీవితాన్ని అభివృద్ధి దిశగా నడిపించుకోవాలని సూచించారు. ప్రస్తుతం భారతీయులు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే, దానికి పునాది మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చూపిన విద్యా దార్శనికతేనని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.
మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, బీసీ వెల్ఫేర్ అధికారిని విజయలక్ష్మి, ఐడిఓసి అధికారులు, సిబ్బంది మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారం అందించండి.



- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.
- చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం- భారీ బైక్ ర్యాలీ...
- జిల్లా పోలీసులు చేపట్టిన చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం...
- కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),నవంబర్ 11,** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పిలుపు మేరకు నవంబర్ 15వ తేదీ వరకు జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం- డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాల లో భాగంగా సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్ నుండి లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు భారీ బైకు ర్యాలీని నిర్వహించారు. ముందుగా ఈ ర్యాలీని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన యువత పడకుండా,వారికి అవగాహన కల్పించడం, గంజాయి అక్రమ రవాణా ను అడ్డుకోవడం కోసం నిరంతర తనిఖీలు చేపట్టడం వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారి సమాచారం అందించి భాద్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు.మత్తుకు బానిసలై యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు.ఎవరైనా నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ గానీ, విక్రయిస్తూ గానీ పట్టుబడితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే పీడియాక్టులను కూడా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఎస్పీ జెండాను ఊపి బైకు ర్యాలీని ప్రారంభించారు.1000 మందికి పైగా ఈ ర్యాలీలో స్థానికులు,ప్రముఖులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,1టౌన్ సీఐ కరుణాకర్,లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి,సుజాతనగర్ ఎస్సై రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

# జూలూరుపాడుబిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చాపలమడుగు



**. సీకే న్యూస్ ప్రతినిధి బాధావత్ హాథీరాం నాయక్**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల అధ్యక్షుడుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖాళీగా ఉన్న మండల అధ్యక్ష పదవులకు జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు కొత్త అధ్యక్షులు నియమించారు అందులో భాగంగా జూలూరుపాడు మండలంలో పార్టీ కోసం పనిచేసిన ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన చాపల మడుగు రామ్మూర్తిని నియమించారు.,కానీ రాష్ట్ర పార్టీ ఆదేశానుసారము ఆ కమిటీని రద్దు చేశారు. తాజాగా ఖాళీగా ఉన్న మండలాల్లో అధ్యక్షులుగా నియమించుకోండి అని రాష్ట్ర నాయకత్వం ఆదేశించడంతో ఈ పదవి మరలా చాపల మడుగు రామ్మూర్తికే వరించింది. ఈ సందర్భంగా చాపలమడుగు రామ్మూర్తి మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారము నడుచుకుంటానని అన్నారు . కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి ప్రజలకు 6 గ్యారంటీలు హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, మండల కేంద్రంలో ఉన్న సమస్యల గురించి అధికారులను నిలదీస్తామని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని మండల అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 35, కోట్ల వ్యయంతో.. మంజూరైన రెండో దశ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన చింతకాని మండల కాంగ్రెస్ నాయకులు, మండల అధికారులు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**



తెలంగాణ ఉపముఖ్యమంత్రి%ఁ% ఆర్థిక, విద్యుత్ శాఖ మాత్యులు. మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి ధ్యేయం గా పాడిపంటలు, గ్రామాలు.సస్యంగా నిర్మించాలని ఉద్దేశంతో..మండల పరిధిలోని వందనం,,కోదుమూరు రాఘవపురం, లచ్చగూడెం గ్రామాలకు నీళ్లు అందించేటందుకు రెండో దశ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను,మరియు శిలా పథకాన్ని , సభా స్థలాన్ని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో.. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ సురేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ %ఁ% మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్కే కాసిం, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు %ఁ% ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాస్ రెడ్డి ,మండల కాంగ్రెస్ నాయకులు ఓర్స్ వీరభద్రం, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కే పాషా, వందనం మాజీ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, పెంట్యాల అప్పారావు, వందనం గ్రామ శాఖ అధ్యక్షులు పాశం సంజీవరెడ్డి, కొల్లి గోవిందరావు, కొల్లి సీతయ్య, షేక్ వద్దండు, తదితరులు

# ఆత్మకూరు ఎం లో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్మూలన సంస్థ

- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సీనియర్ సి ఆర్ పి ల ఆధ్వర్యంలో రెండవ రోజు మండల మహిళా సమాఖ్య ప్రత్యేక శిక్షణ సమావేశం



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూర్ (ఎం) మండల మహిళా సమాఖ్య కార్యాలయం లో పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ సీనియర్ సి ఆర్ పి ల ఆధ్వర్యంలో రెండవరోజు మండల మహిళా సమాఖ్య ప్రత్యేక శిక్షణ సమావేశం జరిగింది.ఈ సమావేశం లో మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యలు సమావేశాలు నిర్వహించుకునే విధానం పై ఓబీ బాధ్యతలు సిబ్బంది విధుల పై సంఘాల బలోపేతం పై శిక్షణ ఇవ్వడం జరిగింది.
సమావేశం లో మండలసమాఖ్య ఏపీఎం జీ నర్సింహ్మా, జిల్లా సమాఖ్య కార్యదర్శి మండల సమాఖ్య అధ్యక్షురాలు రచ్చ పల్లవి, సీసీలు హరిబాబు, కొమురయ్య,సి ఆర్ పి లు రేణుక, వాణి లు,గ్రామ సంఘాల ప్రతినిధులు, మండల సమాఖ్య
సీ వో నల్ల చంద్ర స్వామి, అకౌంటెంట్ యాస మానస పాల్గొన్నారు.

# నేడు పాల్వంచలో సిపిఐ జిల్లా స్థాయి మీటింగ్....



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 11,**సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల-పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం పాల్వంచ కేఎల్ఆర్ డిగ్రీ కళాశాల రోడ్డులోని శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా నిర్మాణ బాధ్యుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ వంద సంవత్సరాల వేడుకలు, రాష్ట్ర, జిల్లా ప్రచార జాతాలు, పైలాన్ల ఏర్పాటు, జనసమీకరణ, జనసేవాదళ్ క్యాంపుల నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సభ్యత్వం, పునరుద్ధరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

# శ్రీ గ్లోబల్ హైస్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం..




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హైస్కూల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్య దినోత్సవం వేడుకలు నిర్వహిస్తారని వివరించడం జరిగింది. హిందీ, అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేశారని, దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పనిచేశారని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని వివరించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణిస్తూ సమాజ సేవ చేయాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ అయినటువంటి వాహిని, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వాటర్ షెడ్ ని ప్రారంభించిన కేంద్ర మంత్రిశివరాజ్ సింగ్ చౌహాన్





**గుంటూరు, సి కే న్యూస్, నవంబర్ 11:** వాటర్ షెడ్, మిషన్ వాటర్ పునరుద్దాన్ కార్యక్రమం కింద వెంగలాయపాలెంలో ఏర్పాటు చేసిన చెరువును ముఖ్య అతిథి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభి వృద్ధి, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామీణాభి వృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూజైత్ అనే గ్రామంలో ఉదయించిన తార, జనసేవనే ధ్యేయంగా నింపు కొని సేవ చేస్తున్న ఒక మహా నాయకుడు చౌహాన్ ఈ రోజు మన ముందుకు విచ్చేశారన్నారు. కష్టపడే చేతులకు,మట్టితో స్నేహం చేసే రైతులకు, ఆకాశమంత అభిమానం నింపుకొని విచ్చేసిన ఆడపడుచులకు, నా గుంటూరు ప్రాంత ప్రజలకు కార్యక్రమంలో పాల్గొన్నందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అన్నారు.భారతదేశ జనాభాలో 60 శాతం మంది ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో వర్షం పడితే ప్రజలు ఆనందంగా ఉంటారు. ఇలాంటి పరిస్థితిని గుర్తించిన విజనరి లీడర్ నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకు వచ్చారన్నారు. అలాగే ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన విధానాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ ను అన్నా అని ఎలా అభిమానంగా పిలుస్తారో, మధ్యప్రదేశ్ లో చౌహాన్ ని మామ అని అంత ఆప్యాయంగా పిలుచుకుంటారు. సుదీర్ఘకాలం పాటు రాజకీయంలో కొనసాగుతూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన అందుబాటు లోకి తీసుకువచ్చారు. అలాంటి నాయకులు మేము పిలవగానే గుంటూరుకు వచ్చి, గుంటూరుకు ఫండింగ్ ఇచ్చి సహకరిస్తున్నారన్నారు. 2019 కి ముందు 'మన్ రేగా' పథకం ద్వారా చిన్న చిన్న కాంట్రాక్టులు చేసిన వారికి గతంలో నిధులు ఆపివేస్తే, తిరిగి ఇప్పుడు తీసుకురాగలిగాము. ఇవాళ మేము ప్రారంభించిన వాటర్ షెడ్ పథకం కేవలం నీటి సరఫరాకు మాత్రమే కాకుండా, శరీరానికి నడక అలవాటు చేసే విధంగా, పిల్లలకు వ్యాయామం అందించే విధంగా, అక్కడ చెరువు చుట్టూ 350 కొబ్బరి చెట్లను పెంచి, ఏడాదికి రూ. 3 లక్షలు ఆదాయం అందే విధంగా, గ్రామీణ అవసరాలకు ఆర్థిక వనరుగా ఉపయోగపడేలా అనేక కోణాల్లో దీనిని రూపొందించడం జరిగిందన్నారు. ఇంతటి మహా కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులు శశిభూషణ్, కృష్ణ తేజ, గ్రామీణ అభివృద్ధి అధికారులు, టిడిపి నాయకులు అందరికి ఈ సందర్భంగా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. అనంతరంకేంద్ర మంత్రి చౌహాన్ మాట్లాడుతూ ఖాళీ చేతులతో రావడం ఇష్టం లేదు కాబట్టి మా సోదరులు రూ. 380 కోట్ల నిధులను తీసుకువచ్చి ఈ రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి అందించడం జరుగుతుందన్నారు. నాతో పాటు ఈ రోజు కార్యక్రమానికి విచ్చేసినటువంటి మీ అందరి ప్రియమైనటువంటి నాయకులు, పార్లమెంట్ సభ్యులు, నా తోటి సోదరులు చంద్ర శేఖర్ కి నా హృదయ పూర్వక ధన్యవాదాలు అన్నారు. మీకు పార్లమెంటు సభ్యులుగా వున్న చంద్ర శేఖర్ పార్లమెంటులో మాట్లాడితే ప్రతి ఒక్కరు నోళ్లు అప్పగించి చూస్తూ ఉంటారు. ఆయన అనుసరించే విధానాలు ప్రసంగించే ప్రతి పాయింట్ ని ప్రతి ఒక్కరు శ్రద్ధగా వింటుంటారన్నారు.మన పార్లమెంటుకు ఇలాంటి ఆణిముత్యాన్ని అందజేసిన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. హిందీ మాట్లాడేటటువంటి చంద్ర శేఖర్ మాట్లాడినటువంటి హిందీ ప్రతి ఒక్కరినే ఆలోచింపజేసేలా ఉంది. ఈసారి నేను ఆంధ్రప్రదేశ్ కు వచ్చినప్పుడు కచ్చితంగా తెలుగు నేర్చుకొని వస్తాను. నిన్న ఢిల్లీలో జరిగినటువంటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఆ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కారణంగానే ఎంతో ఘనంగా జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని సాదాసీదాగా ప్రజలకు ఉపయోగపడే విధంగా మాత్రమే ఏర్పాటు చేశాం అన్నారు. రైతుకు నేను చేయదగిన సేవను ఒక ప్రార్థనగా భావిస్తాను, ఇక్కడున్న ప్రతి ఒక్క నాయకులు ప్రజలకు సేవ చేయడం కోసమే మాలాగా వచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి ఒక వరం. అత్యంత బలవంతులు, ప్రసిద్ధ విజనరీ కలిగిన నాయకులు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తీసుకున్న హెల్తీ ఆంధ్ర – హ్యాపీ ఆంధ్ర – వెల్దీ ఆంధ్ర నిజంగా ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. రైతుల ఆంధ్ర ప్రదేశ్, రైతుల సంక్షేమం కోసం ఈ చౌహాన్ ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. మిర్చి రైతులు ధరలు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో ధరలు పెంచి ఆదుకున్న సమయంలో, మామిడి రైతులను ఆదుకున్న సమయంను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. మంచినీరే మనిషి జీవితమని, మట్టి లేని రైతు జీవితం ఉండదని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నానన్నారు. ఆ మాటను నిజం చేస్తూ వెంగళాయపాలెంలో చంద్రశేఖర్ అభివృద్ధి పరిచిన ఈ చెరువు దేశానికి ఆదర్శంగా నిలవబోతోంది. ఇలాంటి చెరువులను స్ఫూర్తి గా తీసుకొని భారత దేశ వ్యాప్తంగా మరిన్ని నిర్మించ బోతున్నాము. ఇక్కడ ఉన్నటువంటి నా సోదరీమణులందరూ సంపన్నులు కావాలని ప్రధాని మోదీ, కూటమి ప్రభుత్వం కోరుకుంటుంది. అందుకు అనుకూలం గానే లక్ పతి దీదీ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటు లోకి తీసుకొచ్చింది. లక్ పతి దీదీ కార్యక్రమం ద్వారా ప్రతి మహిళా రూ. రెండు లక్షల ఆదాయాన్ని అర్జించే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ఏ ఒక్క నిరుపేద కూడా కచ్చా ఇళ్లలో ఉండాల్సిన అవసరం లేదు. అందుకు అనుగుణంగా మన ప్రభుత్వం ఒక ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నాము. దీని ద్వారా ప్రతి పేదవాడు పక్కా ఇళ్లలో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాము. ఈ ప్రభుత్వంలో రైతుని రాజు చేసేటువంటి కార్యక్రమాన్ని మా ప్రభుత్వం చేపట్ట బోతుంది. ఒకే ఒక ఆలోచనతో కాకుండా ఈరోజు ఖర్చులు తగ్గించేటువంటి కార్యక్రమంతో పాటు, అనేక విధాలుగా రైతులని కాపాడుకునేటువంటి క్రమంలో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.చంద్రబాబు నాయుడు ఆలోచనతో, మోదీ సహకారంతో ఈ రోజు రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క రైతు కూడా మూడు పంటలు వేసుకున్నటువంటి విధంగా చర్యలు తీసుకోబోతున్నారు. దేశంలో చిన్న, సన్నకారు రైతుల పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. వారి సంక్షేమానికి, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉంది అనికేంద్ర మంత్రి చౌహాన్ తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూగ్రామీణాభివృద్ధి చేపట్టడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు విచ్చేసిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి ఆంధ్ర రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఒక చెరువును అభివృద్ధి పరచి కేవలం అందానికే కాక ప్రజాభియోగంగా, గ్రామ ఆర్థిక వనరుగా, గ్రామ అవసరార్థం వాటర్ స్టోరేజ్ పాయింట్ గా బహుముఖ కోణాల్లో అభివృద్ధి పరచడం సాధారణ మైన విషయం కాదన్నారు. నీటిని కాపాడుకుంటేనే మనకు భవిష్యత్తు ఉంటుందని, ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాం అన్నారు.చెరువుల్లో నీటి ఊట పెరిగి స్థానిక వ్యవసాయానికి, పంటల అభివృద్ధికి రైతన్నకి ఉపయోగపడేలా పరిస్థితి మారుతుంది. వర్షం ద్వారా పడేటువంటి నీటిని, చెరువుల్లో నిలువ ఉన్నటువంటి నీటిని ఎప్పటి కప్పుడు భద్రపరచు కోగలిగితేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొన్ని దశాబ్దాల క్రితమే నీటిని జాగ్రత్త పరచు కోవడంలో భాగంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలనే ప్రక్రియకు నాంది పలికారు.ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సమృద్ధిగా నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, గుంటూరు జిల్లా ఇన్చార్జి మినిస్టర్ కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవి, లిడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఏపీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రానం హరిబాబు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కలెక్టర్ తమీం అన్సారియా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ, డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ సెక్రటరీ మనోజ్ జోషి, జడ్పీ చైర్మన్ క్రిస్టియానా, బిజెపి జిల్లా అధ్యక్షులు తిరుపతి రావు, గుంటూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు

# సామినేని హంతకుల అరెస్టు చేయాలి..

- డీజీపీకి సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకుల వినతి
- రాజకీయ కక్ష్యలతోనే హత్య ఘటన జరిగి 12 రోజులైనా కేసును ఛేదించటంలో నిర్లక్ష్యం



**చింతకాని , సి కే న్యూస్, నవంబర్ 11:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డికి హైదరాబాదులో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పార్టీకి చెందిన సామినేని రామారావును అక్టోబర్ 31వ తేదీన పాతర్లపాడు గ్రామంలో ఉదయం 5:30 గంటల సమయంలో అతి కిరాతకంగా హత్య చేశారని... ఈ ఘటన జరిగి ఇప్పటికీ 12 రోజులు అవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కంద్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.

రాజకీయ కక్షతోనే హత్య

రామారావు బతికి ఉంటే సీపీఐ (ఎం)ను ఓడించటం సాధ్యం కాదని భావించి రాజకీయ కక్షలతోనే ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుట్రపన్ని హత్య చేశారని ఆరోపించారు. హంతకులను నేను స్వయంగా చూశాను.. అని వారి పేర్లతో సహా రామారావు భార్య స్వరాజ్యం పోలీసులకు పిటిషన్ ఇచ్చినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. రామారావు నిస్వార్ధ నాయకుడు, వారి స్వగ్రామానికి రెండుసార్లు ఆయన ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికయ్యారని తెలిపారు. రామారావు సతీమణి ఒకసారి గ్రామ సర్పంచ్ గా పనిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని పేదలకు తమ సొంత భూమిని ఇండ్ల స్థలాల కోసం పంచిన చరిత్ర రామారావు కుటుంబానికి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిగా రామారావు సేవలు అందించారని, సీపీఐ (ఎం)లో దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా తన స్వగ్రామం పాతర్లపాడు లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఇది సహించలేని కాంగ్రెస్ నాయకులు ఆయన ఉంటే రాజకీయంగా తమ మనుగడ సాగదని భావించి, కుట్ర చేసి హత్య చేశారని ఆరోపించారు. ఈ హత్యకు కారణమైన వారందరినీ అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

# చెరువు కట్టపై ఉన్న చెట్లు తొలగింపు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని నాగులవంచ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ కార్యదర్శి బి చిరంజీవి ఆధ్వర్యంలో రెడ్డి చెరువు కట్టపై ఉన్న నడవడానికి వీలుగా అడ్డంగా ఉన్నటువంటి చెడు చెట్లను తొలగించినారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# భక్తి స్ఫూర్తితో 'జై శ్రీరామ్' ఇటుకల తయారీకి కలెక్టర్ ప్రత్యేక చర్యలు



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, , (సాయి కౌశిక్ ),నవంబర్ 11,**
భద్రాచలం శ్రీ సీతారామ దేవస్థానంలో "జై శ్రీరామ్" అచ్చుతో ఇటుకలను తయారు చేయుటకు అవసరమైన ప్రత్యేక మోల్డ్‌లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, బెంగళూరులో ప్రత్యేకంగా తయారు చేయించి దేవస్థానం కు చర్చించారు. సంబంధిత సి ఎస్ ఈ బి మిషన్‌ను కలెక్టర్ మంగళవారం భద్రాచలం పర్యటనలో భాగంగా ప్రత్యక్షంగా పరిశీలించారు.

భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని జై శ్రీరామ్ అచ్చు ఉన్న ఇటుకలను తయారు చేయే విధంగా కార్యా చరణను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సూచనలను కలెక్టర్ ఈవో భద్రాచలం మరియు ఆలయ సిబ్బందికి అందించారు.

# గత పాలకలు, అధికారుల వల్లె ప్రజలు ప్రాణాలు కోల్పోయారు చింతమనేని





**దెందులూరు, సీ కే న్యూస్ నవంబర్ 11:**గత పాలకుల నిర్లక్ష్యం వల్ల, మీ అధికారుల నిర్వాకం వల్ల ఎంత మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారో మీకు తెలుసా?, ఒక్కసారి వెళ్లి ఆ డెత్ అయిన ఎఫ్ఐఆర్ లను పరిశీలించండి చింతమనేని. మనిషిని కోల్పోయి రోడ్డున పడ్డ ఆ కుటుంబాలకు ఎవరు సంజయిషీ చెబుతారు? దెందులూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి పై జరుగుతున్న ప్రమాదాల నివారణ పై ఇదే నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తే చూస్తూ ఉపేక్షించం నేషనల్ హైవే అథారిటీస్ అధికారుల బృందం పనితీరు పై అసంతృప్తి వ్యక్తం చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.భారతీయ జాతీయ రహదారుల నిర్వహణ (ఎన్హెచ్ఎఐ) అధికారుల బృందంతో దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజవర్గ పరిధిలో గల జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణ సహా పలు నిర్మాణాల పై హైవే అధికారులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్షించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు హైవే అథారిటీ అధికారులు మరిన్ని చర్యలు చేపట్టాలని, అదే విధంగా జాతీయ రహదారుల పై చేసే నిర్మాణాలు ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందించేలా ప్రణాళికలు రూపొందించాలనీ, గుండుగోలను గరుడ సెంటర్ వద్ద నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి కేవలం పాదచారులకు మాత్రమే కాకుండా చిన్న తరహా మోటారు వాహనాలు అయిన కార్లు, ఆటోలు కూడా ప్రయాణించేలా నిర్మాణం చేస్తే సమీప గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, గతంలో జరిగిన హైవే నిర్మాణ లోపాల వల్ల, ఆనాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల దెందులూరు నియోజకవర్గ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, ఎఫ్ ఓ బి లు వంటివి లేకపోవటం ఎంతో మంది మృత్యువాత పడి, వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి అని, అటువంటి దుర్ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద ఉన్న లెవెల్ సమస్యను పరిష్కరిస్తూ సత్వరమే చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు రోడ్ల పై ఏర్పడుతున్న గుంతలను పూడుస్తూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, హైవే పై మాధ్యమంలో ఉన్న మొక్కల సంఖ్యను మరింతగా పెంచి హైవే నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీస్ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, రెసిడెన్షియల్ ఇంజనీర్ నాగేశ్వర రావు కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ సహా పలువురు హైవే అథారిటీ సిబ్బంది, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 14.32 లక్షల లాభాల వాటా చెక్కును సభ్యులకు అందజేసిన స్పీకర్

**మాకవరపాలెం, సీ కే న్యూస్ నవంబర్ 11:**మహిళలు ఐక్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. మాకవరపాలెం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్ ద్వారా కేవలం 22 నెలల వ్యవధిలో 14.32 లక్షల రూపాయల నికర లాభాన్ని ఆర్జించడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమాఖ్య సభ్యులకు ఈ లాభం పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, 14,320 మంది సభ్యులకు గాను, ఒక్కొక్కరికి 100 రూపాయల చొప్పున మొత్తం 14.32 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, స్థానికంగా తయారైన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ కల్పించి, వాటిని విక్రయించడం ద్వారా లాభాలు గడించడం గొప్ప విషయమన్నారు. మాకవరపాలెం సమాఖ్య పనితీరు ఇతర సంఘాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పిడి అనకాపల్లి సచిదేవి, మాకవరపాలెం ఎమ్మార్వో రమణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, మండల పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వై పాత్రుడు అధికారులు నాయకులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.







# అభయాంజనేయ స్వామి 12 వ పుష్కర వారోత్సవాలలో పంచకర్ల







**పరవాడ, సీ కే న్యూస్ నవంబర్ 11:** అభయాంజనేయ స్వామి 12 వ పుష్కర వారోత్సవాలలో ముఖ్య అతిదిగా పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. మంగళవారం మహత్ పంచక శాంతి కల్యాణంలో పాల్గొన్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు. లంకెలపాలెం మారుతి జంక్షన్ లో కొలువైయున్న అభయాంజనేయ స్వామి 12 వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన మహత్ పంచక శాంతి కళ్యాణం, మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు కు వేద పండితులు మహా పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రమేష్ బాబు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వజన సంరక్షణ, సర్వ ఉపద్రవ నివారణ కొరకు ఎంతో కష్టపడి జరిపించాల్సిన ఇటువంటి హోమాన్ని కమిటీ సభ్యులు జరిపించడం చాలా అభినందనీయమన్నారు. అనంతరం వేద పండితులచే శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల ప్రసాద్ రావు, స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85 వ వార్డు కార్పొరేటర్ల ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 84 వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పయిల జగన్నాథ రావు, మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పల నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, వార్డు అధ్యక్షులు, పిల్లా శివ కృష్ణ, మాజీ కార్పొరేటర్ డొల్ల రాము నాయుడు, లంకెలపాలెం పిఎసి డైరెక్టర్ సర్వసిద్ధి సన్యాస రాజు, సీనియర్ నాయకులు సుందరపు శ్రీనివాసరావు, దాసరి తాతారావు, చలపతి రెడ్డి రామారావు, బిగిడి రామ గోవింద, కేఎన్ఆర్, మడక రమణ, కోమటి సూరిబాబు, ఆలయ కమిటీ చైర్మన్ మాదాస శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పచ్చికోరు రమణ మూర్తి, ప్రధాన కార్యదర్శి మడక రమేష్ నాయుడు, కోశాధికారి సూరపనేని శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, పరవాడ మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం లో పాల్గొన్న అదీప్ రాజ్





**పరవాడ, సీ కే న్యూస్ :**మండలం లోని భరణికం గ్రామంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్. భరణికం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా పాల్గొన్న పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు గ్రామీణ ప్రాంతాలలో, పెద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ప్రైవేటీకరణ వల్ల వైద్యం ఖరీదైపోయి సామాన్యులకు అందకుండా పోతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాలి, కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రభుత్వానికి మన నిరసనను తెలియజేసే ఒక శక్తి వంతమైన మార్గంమని ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మన హక్కులను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ మెడికల్ కళాశాల ల ప్రైవేటైజేషన్ కు వ్యతిరేకం గా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ప్రజా వైద్య సదుపాయాల రక్షణ కోసం ప్రతి సంతకం ప్రజా హక్కుల కోసం ఒక బలమైన స్వరం.ఈ కార్యక్రమంలో వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు, జడ్పీటీసీ పి.ఎస్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, పరవాడ మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, గొర్లివాన్నిపాలెం నాయకులు గొర్లి గోపి అమ్మలు, వై.సి.పి నాయకులు కావలి వాసు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులు ప్రారంభం.

● పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం (జగన్)



**గాజువాక, సీ కే న్యూస్** స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం (జగన్). ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం 87 వ వార్డ్ పరిధిలో సిదార్థ నగర్ కి ఆనుకొని ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల యాభై సెంట్ల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ పనులను ప్రారంభించుటకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ వొచ్చి గ్రౌండ్ లో మార్కింగ్ చేయడం జరిగిందని, పనులను త్వరగా పూర్తి చేయాలని, చేస్తున్న పనిలో నాణ్యత తగ్గకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు,కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, పావాడ రమణమూర్తి, డీవీ. సూరిబాబు, బొడ్డా సన్యాసిరావు, గండేపల్లి రాము, జాన్ రమేష్, సుందర్ సునీల్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రీయల్ హాబ్ గా పాయకరావుపేట నియోజకవర్గం



వరాహ ఇండస్ట్రీయల్ పార్క్ నిర్మాణానికి హోం మంత్రి భూమి పూజ.

వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు హోం మంత్రి అనిత వెల్లడి.



**నక్కపల్లి, సీ కే న్యూస్ నవంబర్ 11:**నక్కపల్లి మండలం, పాయకరావుపేట నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హాబ్ గా తీర్చి దిద్దడమే లక్ష్యం అని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం హేట్రో పరిశ్రమ సమీపం నల్లమట్టిపాలెం రెవిన్యూ లోవరాహ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి హోం మంత్రి అనిత భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, వరాహ ఇండస్ట్రీయల్ సీఈఓ డా. శ్రీనివాస రాఘవ, భాగస్వాములు ఎం ఏ నాయుడు, ఎం కె విశ్వనాధ్, వి సరళ, ఎం ఉషారాణి లతో కలసి పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ హోట్టహసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా హోం మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంబించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి తో రాష్ట్రంలో పెట్టుబడుల వరదలా వస్తున్నాయన్నారు. చంద్రబాబు పై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు ఈ ప్రాంతంలో పరిశ్రలు ఏర్పాటు కు ముందుకు వస్తున్నారని తెలిపారు. పాయకరావు పేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో వరాహ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ఆమె అనందం వ్యక్తం చేసారు. గత ప్రభుత్వంలో చెత్త పై కూడా పన్ను వేసి ప్రజలను ఇబ్బంది పెట్టారని చంద్రబాబు నాయకత్వంలో చెత్త నుండి సంపద సృష్టించి ప్రజా అభివృద్ధి కి పాటు బడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పదం లో మొదటి స్థానంలో నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేసారు. పరిశ్రమలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రజలు, రైతుల త్యాగ ఫలమేనన్నారు. ఎన్డియే ప్రభుత్వంలో తక్కువ సమయంలోనే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు లభిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని అనిత తెలిపారు. వరాహ ఇండస్ట్రీయల్ పార్క్ వల్ల ఈ ప్రాంతంలో వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయిన్నారు. రాబోయే రోజుల్లో పాయకరావుపేట నియోజకవర్గం అన్ని విధాలగా అభివృద్ధి చెందుతుందని దీని కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ కురందాసు నూకరాజు, నక్కపల్లి పి ఏ సి ఎస్ చైర్ పర్సన్ కె బుజ్జి, దేవర సత్యన్నారాయణ, పలు గ్రామాల టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసాదంలో ఏమి వాడారు..సిట్ దర్యాప్తులో నిజాలు


తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ఈ క్షేత్రం విలసిల్లుతోంది. తిరుమల వెంకటేశ్వర స్వామి ఎంత అయితే ప్రత్యేకమో%ో% స్వామి వారి లడ్డు కూడా అంతే ప్రత్యేకం.. ఈ లడ్డుకు సంబంధించి పేటెంట్ రైట్స్ కూడా తిరుమల తిరుపతి దేవస్థానం సొంతం చేసుకుంది.. ప్రపంచంలో ఏ క్షేత్రానికి లేని విశిష్టత ఈ ఆలయానికి ఉంది. ప్రతిరోజు స్వామి వారి అన్నదాన కేంద్రంలో 90,000 మంది దాకా ఉచిత భోజనం చేస్తుంటారు.. ధూప దీప నైవేద్యాల నుంచి మొదలు పెడితే లడ్డు ప్రసాదం వరకు తిరుమల క్షేత్రంలో ప్రతిదీ ప్రత్యేకమే.. స్వామివారి దర్శనం తర్వాత లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేయడాన్ని భక్తులు తమ అదృష్టంగా భావిస్తుంటారు.ఎంతో విశిష్టమైన చరిత్ర ఉన్న తిరుమల లడ్డు ప్రాశస్త్యం 2019 నుంచి 2024 వరకు దెబ్బ తిన్నది. 2019 నుంచి 2024 వరకు ఏపీలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో తిరుమల దేవస్థానం లో లడ్డూ తయారీకి బోలే బాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి 68 లక్షల కిలోల నెయ్యిని తిరుమల తిరుపతి దేవస్థానం కొనుగోలు చేసింది. ఆ సంస్థ పాలు లేదా వెన్న లేదా నెయ్యి తయారుచేసిన దాఖలాలు లేవు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెంకటేశ్వర స్వామి లడ్డుకు సంబంధించిన వ్యవహారం బయటపడింది. ఆ సమయంలో లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడారని తెరపైకి సరికొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ కొంతకాలంగా లడ్డు తయారీలో చోటు చేసుకున్న అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు చేపడుతోంది..ఆ దర్యాప్తుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి సిబిఐ అందించింది. ఈ నివేదికలో దారుణమైన విషయాలు వెలుగు చూశాయి. తిరుమల





తిరుపతి దేవస్థానం లో 2019 నుంచి 2024 వరకు లడ్డు తయారీలో అక్రమాలు చోటు చేస్తున్నాయని సిబిఐ నివేదికలో పేర్కొంది. లడ్డు తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారని.. వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రాశస్త్యాన్ని దెబ్బతీశారని సిబిఐ నివేదికలో వెల్లడించింది. 2019 నుంచి 2024 వరకు దాదాపు 64 లక్షల కిలోల నెయ్యిని కొనుగోలు చేశారని.. ఇందులో అనేక రకాలైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని సిబిఐ తన నివేదికలో పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాన్ని "కమర్షియల్"
చేశారని సిబిఐ తన నివేదికలో పేర్కొంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. వైసిపి పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. ఇప్పుడు సిబిఐ నివేదికలో కూడా అక్రమాలు జరిగాయని తేలడంతో కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# ఎర్రకోట పేలుళ్ల సూత్రధారులను వదిలిపెట్టం: భూటాన్ నుంచి మోదీ హెచ్చరిక



ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దారుణానికి పాల్పడిన కుట్రదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయనహెచ్చరించారు. నిన్న సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 9 మంది మరణించగా, 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు రోజుల పర్యటన నిమిత్తం భూటాన్‌లో ఉన్న ప్రధాని మోదీ... థింపూలోమాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ పేలుళ్ల వెనుక ఉన్న కుట్రను మన దర్యాప్తు సంస్థలు ఛేదిస్తాయి. సూత్రధారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ న్యాయస్థానం ముందు నిలబెడతాం" అని మోదీ స్పష్టం చేశారు.ఢిల్లీ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చానని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "నిన్న సాయంత్రం జరిగిన ఈ భయానక ఘటన అందరినీవిషాదంలోకి నెట్టింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను అర్థం చేసుకోగలను. ఈ కష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న అన్నిఏజెన్సీలతో తాను రాత్రంతా టచ్‌లోనే ఉన్నానని ప్రధాని వెల్లడించారు.

# ప్రజల కోసం పోలీసులు ప్రజల రక్షణలో పోలీసులు

**టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి**


కేంద్ర హెూం శాఖ దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో, మహబూబాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించగా మహబూబాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రద్దీ ప్రాంతాలైన రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, నెహ్రూ సెంటర్ పరిసరాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూప్రజలకు ఏమైనా అనుమానాస్పద వ్యక్తులు, లేదా వస్తువులు గమనించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజల భద్రత, శాంతి భద్రతలు కాపాడడం పోలీసు విభాగం ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్, టౌన్ ఎస్సై అలీం, సిబ్బంది మరియు బాంబ్ స్క్వాడ్ సభ్యులు పోలీస్ లు రామయ్య, యాకయ్య, మురళీ, డాగ్ హ్యాండ్లర్ లు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో భద్రతా చర్యల పర్యవేక్షణ

ఢిల్లీలో జరిగిన బాంబు దాడుల నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఈరోజు ఆలయంలోని భద్రతా విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడి,
భక్తుల భద్రత కోసం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, క్షుణ్ణమైన తనిఖీలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, లగేజ్ స్కానింగ్ మరియు అత్యవసర ప్రతిస్పందన చర్యలు వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.చైర్మన్ మాట్లాడుతూ "ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్క భక్తుడి భద్రతకు
అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే పై అధికారులకు తెలియజేయాలి. భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం అనుమతించబడదు," అన్నారు.
అలాగే సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చి, అన్ని ప్రవేశ ద్వారాల వద్ద భద్రతా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.



## మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం



రాష్ట్రంలో మరో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. విజయవాడ–హైదరాబాద్ హైవేపై నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు వద్ద 'విహారి' ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందులో ఉన్న 29 మంది ప్రయాణికులు అద్దాలు పగులగొట్టుకొని బయటికి దూకారు. తర్వాత బస్సు పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతే 29 మందిని రక్షించిందినల్గొండలోని చిట్యాల వద్ద బస్సు దగ్ధమైన ఘటనలో డ్రైవర్ అప్రమత్తతే 29 మంది ప్రయాణికులను రక్షించింది. ప్రైవేట్ ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగగా సకాలంలో స్పందించి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. వెంటనే వారు బస్సు నుంచి దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ఓటు వేసిన హైడ్రా కమిషనర్

జూబ్లీహిల్స్ శాసన సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధుర నగర్ లోని శ్రీనిధి విశ్వభారతి హై స్కూల్ లోని పోలింగ్ బూత్ 132 లోకుటుంబ సమేతంగా వచ్చి ఓటు వేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలి, వృధా చేసుకోవద్దుఅని సూచించారు. యువత కూడా ఓటు వేసిన తర్వాత మిగతా పనులు చూడాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

## ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో మూవీ టీం సందడి

రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో తిరువీర్,టీనా శ్రావ్య జోడీ గా మాస్టర్ రోహన్ కీలక పాత్రలో నటించిన చిత్రం ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో.సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని నిర్మించారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా విడుదలై హిట్ టాక్ ని సంపాదించు కుంది.ఇటీవల కాలం లో వచ్చిన బెస్ట్ కామెడీ చిత్రమిదని సినిమా చూసిన ప్రేక్షకులు చెబుతు న్నారు. సోషల్ మీడి యాలోనూ ఈ సినిమాపై ప్రశంసల వర్షంకురిపిస్తు న్నా సందర్భంగా విశాఖలో మూవీ టీం సందడి చేసింది.చిత్ర విజయో త్సవ ర్యాలీలో భాగంగా విశాఖలో ని ఒక సినిమా హాల్లో సినిమా యూనిట్ ప్రేక్షకులతో సినిమా చూసి అభి మానుల మధ్య ఆనందం గావిజయోత్సవం జరుపుకు న్నారు ఈ సందర్భంగా హీరో తిరువీర్ హీరోయిన్ టీనా శ్రావ్య, దర్శకుడు రాహుల్ శ్రీనివాస్, నిర్మాత బాపిరాజు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

## జూబ్లీహిల్స్లో ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

**- భట్టి విక్రమార్క పర్యటన దుర్మార్గం**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పద్ధతి విస్మయకరంగా ప్రజాస్వామ్య విలువలను పాడు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగానిబంధనలు పక్కనబెట్టి జూబ్లీహిల్స్లో పర్యటించడం ఘోరమైన ఎన్నికల నియమావళి ఉల్లంఘన. ఆయనతోపాటు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు బరితెగించి డబ్బులు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభపెడుతున్నారు.ప్రజలు ప్రశ్నిస్తే కాంగ్రెస్ అనుచరులు దాడులకు దిగుతున్నారు. ఈ దౌర్జన్యాల మధ్య పోలీసులు, ఎన్నికల అధికారులు మౌనం వహించడం అత్యంత ఆందోళనకర విషయం. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్నిదెబ్బతీసే ఈ చర్యలను వెంటనే ఆపాలని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా డిమాండ్ చేస్తోంది. ఎన్నికల సంఘం వెంటనే దృష్టి సారించి, భట్టి విక్రమార్క సహా ఉల్లంఘనలకు పాల్పడిన కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేసింది.

## మంత్రి నారా లోకేష్ 72వ రోజు ప్రజాదర్బార్ తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 72వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ను కలిసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, తెలుగుదేశం కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతిఒక్కరినిఆప్యాయంగా పలకరించి సమస్యలు మంత్రి లోకేష్ తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై ప్రజలు, టీడీపీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడే మంత్రి సిబ్బందికిఆదేశాలు జారీ చేసారు. విజ్ఞప్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

## 12కి చేరిన మృతుల సంఖ్య

ఎర్రకోట పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి చెందటంతో 12కి చేరింది. ప్రస్తుతం ఆసుపత్రిలో 17 మంది క్షతగాత్రులు ఉన్నారు. సోమవారం ఇండియా గేట్ వద్ద కారులో పేలుడు సంభవించి 9 మంది మృతి చెందగా పదుల సంఖ్యలో గాయపడ్డారు.

## కొత్త వ్యాపారంలోకి అదానీ ఎంట్రీ.. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్..




భారత్ క్లీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో ఆదానీ గ్రూప్ మరో చరిత్రాత్మక ప్రాజెక్ట్ ప్రారంభించబోతోంది. గుజరాత్‌లోని ఖవడా ప్రాంతంలో దేశంలోనే అతిపెద్ద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను నిర్మించనున్నట్లు సంస్థ ప్రకటించింది. మొత్తం 1126 మెగావాట్ల సామర్థ్యంతో.. 3530 మెగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజీ కెపాసిటీ కలిగిన ఈ ప్రాజెక్ట్ 2026 మార్చి నాటికి ప్రారంభమవనుందని తెలుస్తోంది. దీంతో ఇప్పటి వరకు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, ట్రాన్స్ మిషన్ వ్యాపారాల్లో ఉన్న అదానీ గ్రూప్ బ్యాటరీ స్టోరేజ్ వ్యాపారంలో అడుగు పెట్టినట్లయింది. దేశంలో ఇప్పటివరకు ఇంత పెద్ద స్థాయిలో విద్యుత్ స్టోరేజీ ప్రాజెక్టు ఎక్కడా లేదు. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇది అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుంది. 700 కంటైనర్ ఆధారిత బ్యాటరీ యూనిట్లతో రూపుదిద్దుకునే ఈ వ్యవస్థ 3 గంటలపాటు 1126 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యుత్ డిమాండ్‌ను సమతుల్యం చేయడం, గ్రిడ్ స్థిరత్వాన్ని పెంచడం, ట్రాన్స్‌మిషన్ రద్దీని తగ్గించడం, రెన్యూవబుల్ ఎనర్జీ వినియోగాన్ని గరిష్ఠం చేయడం సాధ్యమవుతుందని ఆదానీ గ్రూప్ చెప్పింది. అత్యాధునిక లిథియమ్ అయాన్ బ్యాటరీ టెక్నాలజీతో పాటు అధునాతన ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌ను కూడా ఇందులో జోడిస్తోంది కంపెనీ. ఎనర్జీ స్టోరేజీ అంటేనే రెన్యూవబుల్ ఎనర్జీ భవిష్యత్తు గుండె చప్పుడుగా గౌతమ్ ఆదానీ అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా తాము ప్రపంచ స్థాయి ప్రమాణాలను నెలకొల్పడమే కాకుండా, భారతదేశ ఎనర్జీ స్వావలంబన, సుస్థిరత దిశలో కీలకమైన అడుగు వేస్తున్నట్లు వెల్లడించారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని.. 2027 ఆర్థిక సంవత్సరానికి 15 గిగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ సామర్థ్యం సృష్టి.. ఐదేళ్లలో 50 గిగావాట్ అవర్ లక్ష్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అదానీ వెల్లడించారు.

## ఢిల్లీ ఎర్రకోట దగ్గర బాంబు పేలుడు ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్లో దూసుకుపోతున్న డిఫెన్స్ స్టాక్స్



ఢిల్లీ ఎర్రకోట దగ్గర సోమవారం సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడు దేశాన్ని భయాందోళనలకు గురిచేసింది. తాజా ఘటనతో స్టాక్ మార్కెట్లో డిఫెన్స్ స్టాక్స్‌లో భారీ ర్యాలీ కనిపించింది. దేశ రాజధానిలో ఎర్రకోట పేలుడు – స్టాక్ మార్కెట్‌లో ప్రభావం స్టాక్ మార్కెట్లకు కూడా విస్తరించింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ దగ్గర కారులో జరిగిన శక్తివంతమైన పేలుడులో కనీసం 12 మంది మరణించగా, 30కుపైగా గాయపడ్డారు. అత్యున్నత భద్రతా సంస్థలు ఘటనపై విచారణ ప్రారంభించాయి, దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. పేలుడుతో పాటు, భద్రతా సంస్థల చర్యలు, కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నలు మిగిలిపోవడం మార్కెట్‌లో అనిశ్చితిని పెంచింది.?

**డిఫెన్స్ స్టాక్స్ దూకుడు..**

పేలుడు తర్వాతి రోజున మార్కెట్లో డిఫెన్స్ కంపెనీల స్టాక్స్ హఠాత్తుగా పెరుగుదలను చూసాయి. MTAR Technologies, Data Patterns, Dynamatic Technologies లాంటి సంస్థలు 5-%6 మధ్య లాభపడగా. Garden Reach Shipbuilders & Engineers, Solar Industries లాంటి డిఫెన్స్ స్టాక్స్ కూడా 2.8% – 4.5% వరకు లాభపడ్డాయి. ఈ షేర్ ర్యాలీకి ప్రధాన కారణం ఇటీవలి కాలంలో జరిగిన ఉగ్రదాడులు, భద్రత పై దేశం ఆందోళన, అలాగే ప్రభుత్వ స్పందన అని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దీనికి తోడు ప్రముఖ ఇన్వెస్మెంట్ గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గత నెలలో సోలార్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్, డేటా ప్యాట్రన్స్, పిటిసి ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లకు కొనుగోలు రేటింగ్ అందించటం కూడా సెంటిమెంట్రను బలపరిచింది. ఇంట్రాడేలో బెంచ్ మార్క్ సూచీలు నష్టాలతో ట్రేడింగ్ కొనసాగిస్తున్నప్పటికీ.. నిఫ్టీ డిఫెన్స్ ఇండెక్స్ మాత్రం మరింత వేగంగా పైకి వెళ్లింది. నేషనల్ సెక్యూరిటీ ప్రాధాన్యత, స్టాక్ మార్కెట్‌లో విదేశీ పెట్టుబడిదారుల మనోభావం – ఇవన్నీ డిఫెన్స్ రంగానికి మద్దతు ఇచ్చే అంశాలుగా నిలిచాయి.?ఎర్రకోట పేలుడు దేశ భద్రతపై ఆందోళనలు రేకెత్తిస్తున్న క్రమంలో ఇన్వెస్టర్లు డిఫెన్స్ షేర్లలో బలమైన నమ్మకంతో పెట్టుబడులకు దిగారు. భవిష్యత్‌లో ప్రభుత్వ చర్యలకు అనుగుణంగా ఈ రంగంలో ఇలాంటి అప్రమత్తత, శక్తివంతమైన నడక కొనసాగుతుందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# వైకల్యం 'ఆట'కట్టు



పిల్లలు ఎదగటం, నేర్చుకోవటంలో ఆటలు కీలక పాత్ర పోషిస్తాయి. దివ్యాంగ పిల్లలకైతే మరింత మేలు చేస్తాయి. నైపుణ్యాలు అబ్బటానికి, సామర్థ్యాలు పెంపొందటానికి స్నేహం, క్రీడలు తోడ్పడతాయి. శారీరకంగా బలంగా ఉండటానికే కాకుండా నలుగురితో కలివిడిగా ఉండటం, అభిప్రాయాలను పంచుకోవటం, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవటం వంటి సామాజిక, మానసిక ప్రయోజనాలూ చేకూరుతాయి.

**సామాజిక-భావోద్వేగ నైపుణ్యాలు**

ఇతర పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు స్నేహ సంబంధాలు ఏర్పడతాయి. ఇచ్చి పుచ్చుకోవటం అలవడుతుంది. సహనం, సమస్యలను పరిష్కరించటం వంటివీ అబ్బుతాయి. ఒకవేళ పిల్లలు భావోద్వేగాలను అర్థం చేసుకోవటం, అదుపులో పెట్టుకోవటంలో ఇబ్బంది పడుతుంటే మానసిక నిపుణులను సంప్రదించి, సలహా తీసుకోవటం మంచిది.

**భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు**

నలుగురితో కలిసి ఆడుకుంటున్నప్పుడు మాట్లాడటం, వినటం, భావాలను వ్యక్తీకరించటంలో కొత్త తీరులను నేర్చుకుంటారు. ఉదాహరణకు– ఇతర పిల్లలు ఎలాంటి పదాలను వాడుతున్నారు? తాము చెప్పాలనుకునే విషయాన్ని సైగలతో ఎలా సూచిస్తున్నారు? అనేవి గ్రహిస్తారు. వీటిని ఉపయోగించటానికీ ప్రయత్నిస్తారు. దివ్యాంగ పిల్లలు ఎలా అభిప్రాయాలను వెల్లడిస్తున్నారో ఇతర పిల్లలూ తెలుసుకుంటారు. దీంతో పరస్పర భావ వ్యక్తీకరణ మెరుగవుతుంది. భావోద్వేగాల మీద పట్టు, ప్రవర్తన మార్చుకోవటం వంటి లాభాలూ చేకూరుతాయి.

దివ్యాంగ పిల్లలు తమ భావాలను మాటలతో చెప్పటానికి ఇబ్బంది పడుతుంటే స్పీచ్ థెరపిస్టు సాయం తీసుకోవచ్చు.

**శారీరక నైపుణ్యాలు**

పరుగెత్తటం, గెంతటం, బంతి విసరటం, నృత్యం చేయటం, మెట్లు ఎక్కటం వంటివి వినోదాన్ని కలిగించటమే కాదు.. ఇతరులతో స్నేహం, అనుబంధాలకూ బీజం వేస్తాయి. ఇలాంటి శ్రమతో కూడిన ఆటలతో శారీరక సామర్థ్యం, కదలికలూ మెరుగవుతాయి. ఆత్మ విశ్వాసం ఇనుమడిస్తుంది. తనకు నలుగురు దన్నుగా ఉన్నారని, తనకు విలువ ఇస్తున్నారనే భావన కలుగుతుంది.

శారీరక వైకల్యంతో ఆటల్లో చురుకుగా పాల్గొనలేకపోతున్నట్టయితే ఫిజియో థెరపిస్ట్ లేదా ఆక్యుపేషనల్ థెరపిస్టును సంప్రదించాలి. ఎలా కదలాలో, నలుగురితో కలిసి ఎలా ఆడాలో నేర్పిస్తారు.

**ప్రోత్సాహం అవసరం**

ఆటలాడే విధానం, ఇతరులతో కలిసి సాగటం పిల్లలంతా నేర్చుకోవాల్సిందే. దివ్యాంగ పిల్లలకు ఇది కాస్త కష్టంగా ఉండొచ్చు. అలాగని అశ్రద్ధ చేయొద్దు. వారికి కొంత దన్నుగా నిలిస్తే త్వరగానే నేర్చుకుంటారు.

**ఆటబొమ్మలు, ఆటల ఎంపిక**

దివ్యాంగ పిల్లల సామర్థ్యాలు మిగతా వారి కన్నా భిన్నంగా ఉండొచ్చు. అందువల్ల వారికి ఇష్టమైన, అనుగుణమైన ఆటబొమ్మలు కొనివ్వటం, ఆటలను ఎంపిక చేయటం మంచిది. దీంతో వారికి ఆత్మ విశ్వాసం కలుగుతుంది. అప్పుడు ఇతరులతో ధైర్యంగా ఆడటానికి వీలవుతుంది.

**ప్రత్యేక చోటు**

ఆడుకోవటానికి ఇతర పిల్లలను ఇంటికి ఆహ్వానిస్తుంటే ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. ఫర్నిచర్ ఎక్కువగా లేని, విశాలమైన చోటైతే ఇంకా మంచిది. ఎక్కువ మంది, వివిధ రకాల ఆటలాడుకోవటానికి వీలుంటుంది.

**అవసరమైనప్పుడు సాయం**

కొన్ని విపత్కర సమయాల్లో దివ్యాంగ పిల్లలకు సాయం చేయాల్సిన పరిస్థితి తలెత్తొచ్చు. ఉదాహరణకు ఏదైనా మాట తట్టనప్పుడు పక్క నుంచి ఊతమివ్వచ్చు. ఇది భావోద్వేగాలను అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. ఆటలాడేటప్పుడు సాయపడటానికి కొన్ని ప్రశ్నలు, వాక్యాలనూ పిల్లలకు నేర్పించొచ్చు. 'నేనూ ఆ బొమ్మతో ఆడాలని అనుకుంటున్నాను.. ఇద్దరమూ కలిసి ప్రయత్నిద్దామా? లేదా నువ్వు అలా చేయటం నాకు నచ్చటం లేదు'.. ఇలాంటి మాటలను నేర్పిస్తే తమ అవసరాలను తోటి పిల్లలకు తేలికగా తెలియజేయటానికి వీలవుతుంది.

**పెద్ద, చిన్న పిల్లలతో కలిపి**

తమ కన్నా పెద్ద, చిన్న పిల్లలతో కలిసి ఆడుకోవటం బాలలకు చాలా సరదాగా ఉంటుంది. ఇది దివ్యాంగ పిల్లలకు మరింత ఎక్కువగా మేలు చేస్తుంది. వేర్వేరు రకాల ఆటలను ఆస్వాదిస్తూ ఆడతారు. సహనం, ఓపిక అలవరచుకుంటారు. వైవిధ్యాన్ని అర్థం చేసుకోవటం, అంగీకరించటం అబ్బుతుంది.

## మందు, సిగరెట్ అలవాటు ఉన్నోళ్లకు.. ఇన్సూరెన్స్ ప్రీమియం క్లెయిమ్స్‌లో వచ్చే ఇబ్బందులు ఏంటో తెలుసా..!




చాలా మంది ప్రజలు తమ లైఫ్‌స్టైల్‌లో భాగంగా సిగరెట్లు కాల్చడం, మందు తాగటాన్ని లైట్ తీసుకుంటుంటారు. అయితే ఈ అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యానికి మాత్రమే కాకుండా ఆర్థికంగానూ నష్టాన్ని కలిగిస్తాయి. అదెలా అంటే సదరు అలవాట్లు ఉన్న వ్యక్తి ఇన్సూరెన్స్ కొనుగోలు కోసం ప్రయత్నించినప్పుడు బీమా కంపెనీలు వారి అలవాట్లను పరిగణలోకి తీసుకుని ప్రీమియం లెక్కిస్తాయి. అందువల్ల వారు చెల్లించాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియం సాధారణ వ్యక్తులతో పోల్చితే ఎక్కువగా ఉంటుంది. ICICI లాంబార్డ్ ఇండియా వెల్‌నెస్ ఇండెక్స్ 2024 ప్రకారం.. సర్వేలో పాల్గొన్న వారిలో సుమారు 25% మంది రెగ్యులర్‌గా పొగతాగుతున్నారని, 20% మంది రోజూ మద్యం సేవిస్తున్నట్లు వెల్లడైంది. ఏటా మద్యం వల్ల 26 లక్షల మంది, పొగతాగడం వల్ల 70 లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. అందుకే ఈ అలవాట్లను ఇన్సూరెన్స్ కంపెనీలు "హై రిస్క్ ఫ్యాక్టర్స్"గా పరిగణిస్తాయి.

ఇన్సూరెన్స్ పాలసీ తీసుకునే ముందు.. కంపెనీలు పాలసీదారుడి ఆరోగ్య వివరాల్లో మద్యం, పొగతాగడం వంటి అలవాట్లను స్పష్టంగా అడుగుతాయి. వీటికి సంబంధించిన వివరాలు దాచిపెడితే భవిష్యత్తులో క్లెయిమ్ రిజెక్ట్ అవకాశాలు ఎక్కువని పాలసీబజార్ డైరెక్టర్ అమిత్ ఛబ్రా వెల్లడించారు. బీమా కంపెనీల రూల్స్ ప్రకారం పాలసీ కొనే వ్యక్తి ఏదైనా సమాచారాన్ని పాలసీ ఇచ్చిన కంపెనీ వద్ద 5 ఏళ్ల కాలం పూర్తి కావటానికి మునుపు దాచిపెట్టినట్లు గుర్తిస్తే క్లెయిమ్ రిజెక్ట్ అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఉదాహరణకు.. లివర్ సిర్రోసిస్ వంటి వ్యాధులు మద్యం సేవనంతో నేరుగా సంబంధమున్నట్లయితే ఇన్సూరెన్స్ కంపెనీ క్లెయిమ్‌ను తిరస్కరించవచ్చు. కానీ ఎయిర్ పొల్యూషన్ వంటి ఇతర కారణాల వల్ల కలిగే ఊపిరితిత్తుల వ్యాధులకు మాత్రం క్లెయిమ్ ఆమోదించే అవకాశం ఉంటుంది. పాలసీదారులు తమ క్లెయిమ్ తిరస్కరించబడితే మొదట ఇన్సూరెన్స్ కంపెనీ కంప్లయింట్ అధికారి వద్ద ఫిర్యాదు చేయాలి. పరిష్కారం రాకపోతే ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ లేదా కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చు. అందువల్ల ఎవరైనా కొత్తగా పాలసీ తీసుకునేటప్పుడు నిజాయితీగా అన్ని వివరాలు వెల్లడించడం మంచిది. ఇది మీ ప్రీమియం లెక్కింపును పారదర్శకంగా చేయడమే కాక.. భవిష్యత్తులో క్లెయిమ్ వివాదాలనుంచి కూడా రక్షిస్తుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో.. ఇన్సూరెన్స్ పాలసీని కాపాడుకోవడమూ అంతే ముఖ్యమని గుర్తుంచుకోండి.


## మెటా లేఆఫ్స్: ఈసారి 600 మంది ఇంటికి.. AIతో ఉద్యోగుల పెర్ఫామెన్స్ రివ్యూ!

అమెరికా క్యాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న టెక్ దిగ్గజం మెటా ప్లాట్‌ఫార్మ్ మరోసారి ఉద్యోగులను లేఆఫ్ చేసింది. దీంతో సుమారు 600 మంది తాజా తొలగింపులు ప్రధానంగా ఏఐ సంబంధిత విభాగాల్లో జరిగాయని వెల్లడైంది. కంపెనీ తన"సూపర్ ఇంటెలిజెన్స్" ప్రాజెక్టుల దిశగా రిసోర్సెస్ మళ్లించేందుకు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయంగా అంతర్గత వర్గాలు చెబుతున్నాయి.

కంపెనీ హై పెర్ఫామింగ్ స్మాల్ టీమ్స్ కోసం ప్రయత్నిస్తోందని మెటా చీఫ్ %ూ×% ఆఫీసర్ అలెగ్జాండర్ వాంగ్ అన్నారు. ఫలితాలపై దృష్టి సారించే టీమ్స్ మాత్రమే భవిష్యత్తు లక్ష్యాలను సాధించగలవని ఆయన అన్నారు. దీంతో మెటా ఏఐపై తన ఫోకస్ ఏ స్థాయిలో పెట్టిందనే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. రానున్న కాలంలో మెటా భారీగా %ూ×% మోడల్ ట్రైనింగ్, %ూ×% ఆధారిత యాప్‌ల అభివృద్ధి వంటి కీలక రంగాలపై దృష్టి పెట్టనుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో మెటా ఉద్యోగులు తమ వర్క్ రివ్యూలలోనూ %ూ×% అడుగుపెట్టింది. "మెటామేట్" పేరుతో రూపొందించిన కంపెనీ చాట్‌బాట్ ఇప్పుడు ఉద్యోగులకు వార్షిక పనితీరుపై పెర్ఫామెన్స్ రివ్యూలు రాయడంలో సహాయం చేస్తోంది. ఇది ఉద్యోగుల డాక్యుమెంట్లు, నోట్లు, ఫీడ్‌బ్యాక్‌ను విశ్లేషించి వారి కీ అచీవ్మెంట్స్‌ను సారాంశంగా చూపిస్తుంది. చాలా మంది ఉద్యోగులు దీనిని ఫుల్ ఆటోమేషన్ సాధనంగా కాకుండా ప్రాథమిక టెంప్లేట్‌గా ఉపయోగిస్తున్నారని వెల్లడైంది.



# మాస్ ఫార్ములా జాన్వీకి వర్కౌట్ అయ్యేనా?







అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ బాలీవుడ్ కి ఎలాంటి రోల్స్ తో లాంచ్ అయిందో తెలిసిందే అక్కడి ట్రెండ్ కి తగ్గ కథలు, పాత్రలు ఎంచుకుని ప్రయాణం మొదలు పెట్టింది. ఇప్పటి వరకూ చేసిన పాత్రలన్నీ క్లాసిక్ రోల్స్ గానే కనిపిస్తున్నాయి. తొలి సినిమా %-%ధడక్%-% లో ప్యూర్ లవ్ స్టోరీలో కనిపించింది. ప్రేమ కోసం పరితపించే గాళ్ పాత్రలో అలరించింది. ఆ తర్వాత జాన్వీ పోషించిన పాత్రలన్నీ మరింత క్లాసిక్ గా కనిపిస్తాయి. మధ్యలో %-%గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గాళ్%-% లో ఓ కొత్త తరహా పాత్రతో విమర్శకుల ప్రశంసలందుకుంది. మొత్తంగా జాన్వీ బాలీవుడ్ కెరీర్ ఇంత వరకూ చూసుకుంటే క్లాసిక్ రోల్సే హైలైట్ అవుతాయి. అయితే అందుకు భిన్నంగా సౌత్ లో అమ్మడి ప్రయాణం మొదలైందని చెప్పొచ్చు. తొలి సినిమా %-%దేవర%-% లో మాస్ గాళ్ పాత్రలో అలరించింది. తంగ పాత్రలో అమ్మడు మాస్ గా హైలైట్ అయింది. అమ్మడి ఆహార్యం, యాస భాషలు తనకే కొత్త అనుభూతిని పంచాయి. ప్రస్తుతం %-%పెద్ది%-%లో నటిస్తోంది. ఇందులో అమ్మడు మోడ్రన్ మాస్ అమ్మాయి గా కనిపించబోతుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్తో జాన్వీ పాత్ర ఎలా ఉంటుందన్నది ఓ ఐడియా వచ్చింది. అచ్చియమ్మ అనే పాత్రలో కనిపించబోతుంది.

జాన్వీ లాంటి అందమైన అమ్మాయి ఏకంగా 50 ఏళ్లు వెనక్కి వెళ్లి మరీ అచ్చియమ్మ అనే పేరు పెట్టాడంటే? పాత్ర కూడా ఆ పేరుకు తగ్గట్టే ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమా కూడా పీరియాడిక్ నేపథ్యంతో కూడుకున్నదే. చరణ్ ఊర మాస్ లుక్.. ఎంచుకున్న క్రీడా నేపథ్యం..అందులో హీరో ఆట తీరు చూస్తుంటే? పక్కా మాస్ బొమ్మగా చెప్పొచ్చు. జాన్వీ పాత్ర కూడా అలాగే ఉంటుంది. చరణ్ ప్రియురాలి పాత్రలో జాన్వీ కనిపించనుంది. చరణ్ మాస్ ఎలివేషన్ ఎలా ఉంటుందో ? చెప్పాల్సిన పనిలేదు. ఆ పాత్రను జాన్వీ 100 శాతం మ్యాచ్ చేయాలి. ఈ విషయంలో దర్శకుడు బుచ్చిబాబు ఎగ్జిక్యూషన్ ఎలా ఉంటుంది? అన్నది చూడాలి. సుకుమార్ స్కూల్ నుంచి వచ్చిన దర్శకుడు కావడంతో? ఆ విషయంలో ఎక్కడా తగ్గడు అనే అంచనాలు బలంగా ఉన్నాయి. మరి మాస్ ఎలివేషన్ జాన్వీకి మార్కెట్ లో ఎలాంటి ఐడెంటిటీ తీసుకొస్తుందా? అన్నది చూడాలి. ఇలాంటి పాత్రతో కనెక్ట్ అయితే రెండు రకాల ఉపయోగాలున్నాయి. టాలీవుడ్ సహా కోలీవుడ్ లో కూడా అమ్మడికి అవకాశాలు సులభం అవుతాయి.



# ఏడాదిలోపే 5 విభిన్న పాత్రలు..



సాధారణంగా హీరోయిన్స్ అంటే కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితమవుతారు అనే అపోహ ఒకప్పుడు ఉండేది. కానీ ఆ అపోహలను ఇప్పుడు చాలామంది హీరోయిన్స్ బ్రేక్ చేస్తున్నారు. భిన్న విభిన్నమైన పాత్రలు పోషిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అవకాశం దొరకాలే కానీ తమ సత్తా ఏంటో చూపించడానికి సిద్ధం అంటున్నారు ఈ ముద్దుగుమ్మలు.. అలాంటి వారిలో ప్రథమ స్థానంలో నిలిచింది రష్మిక మందన్న. రష్మిక అదృష్టం ఎలా ఉందంటే.. కేవలం 11 నెలల్లోనే ఏకంగా ఐదు విభిన్నమైన పాత్రలు పోషించి, ఆ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. రష్మిక పాత్రల విషయానికి వస్తే.. పుష్ప 2 సినిమాలో శ్రీవల్లి పాత్రలో నటించి అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత ఛావా సినిమాలో యేసు భాయ్ పాత్రతో రాజసం ఉట్టి పడేలా.. రాజ్యాన్ని కాపాడే పాత్రలో నటించి మెప్పించింది. కుబేర సినిమాలో సమీరా పాత్రలో బిచ్చగాడికి సహాయం చేసే ఒక అద్భుతమైన పాత్రతో ఆకట్టుకుంది. ముఖ్యంగా హీరోయిన్ క్యారెక్టర్ లాగా కాకుండా ఒక విభిన్నమైన పాత్ర పోషించింది రష్మిక. ఆయుష్మాన్ ఖురానా హీరోగా వచ్చిన థామా సినిమాలో బేతాళ పాత్రతో భయపెట్టేసింది. ఇక ఇటీవల వచ్చిన ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలో ఇన్నోసెంట్ అమ్మాయి పాత్రలో నటించి ఆకట్టుకుంది. ఇలా ఒక్కో సినిమాతో ఒక్కో పాత్రను హైలైట్ చేస్తూ.. ఐదు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలు చేసి ప్రేక్షకులను అలరించింది రష్మిక. అంతేకాదు ఈ చిత్రాలన్నింటితో కూడా భారీ కలెక్షన్స్ వసూలు చేసింది. ప్రస్తుతం మైసా , రెయిన్బో వంటి చిత్రాలలో నటిస్తోంది రష్మిక. రష్మిక కెరియర్ విషయానికి వస్తే.. కిరిక్ పార్టీ అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. కన్నడలోనే రెండు మూడు చిత్రాలు చేసింది. అంతేకాదు అక్కడే పలు యాడ్స్ చేస్తూ ప్రేక్షకులను అలరించిన రష్మిక.. తెలుగులో ఛలో సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ , సరిలేరు నీకెవ్వరు ఇలా వరుస చిత్రాలు చేసి ప్రేక్షకులను అలరిస్తోంది.రష్మిక వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే.. విజయ్ దేవరకొండ తో డేటింగ్ చేస్తోంది అంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు రహస్యంగా ఇద్దరు నిశ్చితార్థం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే అప్పుడప్పుడు రష్మిక చేస్తున్న కామెంట్లు మాత్రం వీరిద్దరికి ఎంగేజ్మెంట్ అయిందనే విషయాన్ని పరోక్షంగా స్పష్టమయ్యేలా చేస్తోంది. ఇక అలాగే వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ఉదయ ప్యాలెస్ లో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవడానికి సిద్ధమైనట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఈ జంట పై రోజుకు ఒక వార్త వినిపిస్తున్న నేపథ్యంలో వీళ్ళిద్దరూ అధికారికంగా స్పందించాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు.